తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM నిజామాబాద్ : fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50





వారణాసిలో గురువారం గంగానదిలో 'జల యోగా' సాధన చేస్తున్న నమామి గంగే సభ్యులు

## 11% ఫిట్‌మెంట్

>> చేయాలని ఆదేశించారు. 30 నెలల ప్రజా పాలనలో ఆర్‌టీసీ పురోగతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2023, 2026 మధ్యకాలంలో ప్రజా పాలన ప్రభుత్వం రూ.1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. ఏటూరు నాగారం, పెద్దపల్లి ప్రాంతాల్లో రెండు కొత్త డిపోలను మంజూరు చేసినట్లు తెలిపారు. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని ప్రాథమిక వైద్య సేవల స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 మందికి కారుణ్య నియామకాలు చేపట్టామని వారిలో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని తెలిపారు. ఆర్‌టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సీఎస్ఎస్ బకాయిలు రూ.1,096.90 కోట్ల నుంచి రూ.862 కోట్లకు తగ్గాయని, పీఎఫ్ బకాయిలు రూ.2,018.15 కోట్ల నుంచి రూ.1,714.39 కోట్లకు తగ్గాయని తెలిపారు. అలాగే ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలను కూడా రూ.493.02 కోట్ల మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీసు నుంచి తొలగించబడిన 490 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకున్నామని, మిగిలిన కేసులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. మహాలక్ష్మీ ్మ పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అందిస్తున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అవి ఏ రూట్లలో నడుస్తున్నాయి లాభదాయక రూట్లు ఏవి, నష్టాలు వస్తున్న మార్గాలు ఏవి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్‌టీసీ వద్ద 10,173 బస్సులు, 38,128 మంది ఉద్యోగులు ఉండగా, ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించి సుమారు 61 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్‌లకు శంకుస్థాపన నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మునుగోడు, చండూరు, మర్రిగూడ బస్ స్టేషన్‌ల పునరుద్ధరణ పనులు, నాంపల్లి బస్ స్టేషన్ స్థల పరిశీలనపై సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్‌లకు త్వరలో శంకుస్థాపనలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్ 2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల అధికారితో చర్చించి సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల నుంచి సేకరించిన నిధులతో త్వరలో రూ.1 కోటి చెక్కు అందజేయడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం కింద ఇప్పటివరకు 11 కేసులను పరిష్కరించి ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున చెక్కులు అందించినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ, ఈవీ విధానం, ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణపై దక్షి ణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌ల అభివృద్ధికి అవసరమైన భూబదలాయింపు ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. సమీక్షాసమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడిలతోపాటు ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కట్టుబడి ఉంది

>> ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. అయితే అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు, వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్, ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై బి అలర్ట్

>>సమీక్షా సమావేశం జరిపారు. సమావేశంలో ఎంపిలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి,రఘురాం రెడ్డి,డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ , దీపక్ జాన్ , సయ్యద్ ఖలీద్ సైఫుల్లా , ఎమ్మెల్యేలునవీన్ యాదవ్,శ్రీ గణేష్, నియోజవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎన్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం బిఎల్ఓ లకు అందేలా బి ఎల్ ఏ 2 లు చూసుకోవాలనీ కోరారు. ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు అందించే ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి అర్హ ఓటరికి చేరేలా బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే బిఎల్‌ఏలకు అందజేయాలని, బిఎల్‌ఏలు ఆయా జాబితాలను ఎన్నికల నమోదు అధికారులక) సమర్పించాలని సూచించారు. ప్రతి కాంగ్రెస్ నాయకుడు తన పరిధిలో బూత్‌ల వారీగా సమీక్షలు నిర్వహించి, ప్రజలకు దరఖాస్తుల నింపడం, ఆన్‌లైన్ నమోదు వంటి అంశాల్లో సహాయం అందించాలని కోరారు. ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరును చేరుకునేలా పార్టీ నాయకులు పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలైన సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళా సాధికారత కార్యక్రమాలు, మహిళలను బస్సు యజమానులుగా తీర్చిదిద్దే పథకాలు తదితర అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేలా పార్టీ బలోపేతం దిశగా ప్రతి నాయకుడు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

19-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
పంచమి సా.5.06,
ఆశ్లేష ఉ.10.10
వర్జ్యం : రా.9.49-రా.11.23
దు.ఉ.8.12-ఉ.9.04, 2)మ.12.35-మ.1.27
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. కీలక నిర్ణయంలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**వృషభం:** సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. భూముల విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం.

**మిథునం:** వృత్తిలో మెలకువలు అవసరం. వాతావరణంలో స్వల్ప మార్పుల వలన ఆరోగ్యం మీద కొంతమేర ప్రభావం ఉంటుంది.

**కర్కాటకం:** అయిష్టంగా కొన్ని కార్యక్రమాలు చేయవలసి రావడం కొంత ఇబ్బందికి లోను చేస్తుంది. ఆస్తి వివాదాలు.

**సింహం:** జీవిత భాగస్వామి సహకారం మీకు మనోధైర్యాన్నిస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలు మినహా ఇతర వ్యాపారాలు అనుకూలం.

**కన్య :** ఉద్యోగాల పరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది. నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు.

**తుల :** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు కీలకమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:** ప్రతి వాతావరణంలో కొన్ని అనుకూలంగా ఫలితాలు సాధిస్తారు. మీ వైరి వర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఓర్పు నేర్పులతో మందకొండిగా సాగుతున్న వ్యవహారాలలో కొంత పురోభివృద్ధి సాధిస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** కార్యాలయంపై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసుకోవడంలో వైఫల్యం చెందుతారు. బంధువుల కలయిక.

**మీనం:** సెల్ఫ్ డ్రైవింగ్ సాధ్యమైనంత వరకు చేయకపోవడం ఉత్తమం. ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం..

>>రేవంత్‌రెడ్డి నాగలింగం మొక్కను నాటి ప్రారంభించారు. అనంతరం రూ.35.50 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న అటవీ, ఎకో టూరిజం మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని తాము ప్రయత్నిస్తుంటే గత ప్రభుత్వ బిఆర్ఎస్ పాలకులు అడ్డు తగులుతున్నారని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకుని అక్కడ విషం కక్కే ఫార్మా కంపెనీలు పెడతామని వారు చెబుతున్నారని అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని, 30 వేల ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టులో 15 వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి 60 శాతం పచ్చదనాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. మూసిలో ఉన్న కాలుష్యం కంటే కల్వకుంట్ల కుటుంబం వాళ్ల కడుపులో ఎక్కువ విషం ఉంటుందన్నారు. ఎవరు అన్ని అడ్డంకులు పెట్టినా, అడ్డు పడినా తాము గండిపేట నుండి గౌరెల్లి వరకు 55 కిలో మీటర్ల మేర అంతర్జాతీయ స్థాయిలో మూసిని అభివృద్ధి చేస్తామని, ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతామని అన్నారు. ప్రపంచ పర్యాటకులు వచ్చేలా ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని అన్నారు. పరాయి వారికి అమ్ముడుపోయిన వ్యక్తి మూసి ప్రక్షాళన చేయవద్దని అనడం సిగ్గుచేటన్నారు. జూబ్లీహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి పార్కుకు ధీటుగా అంతర్జాతీయ ప్రమాణాలతో గుర్రంగూడలో పార్కును ఏర్పాటు చేస్తామని అన్నారు. గుర్రంగూడలోని భూమిని కొందరు అమ్ముకోవాలని చూశారని, అయితే మంచి న్యాయవాదులను ఏర్పాటు చేసి అటవీశాఖకే దక్కేలా చేయడం జరిగిందన్నారు. ప్రతి పక్షాలు హైడ్రాను భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే పేదల జోలికి హైడ్రా రాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



గురువారం గుర్రం గూడలో జరిగిన కార్యక్రమంలో మొక్కను నాటుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి సురేఖ

చెరువులు, కుంటలు, కాలువలు, పార్కులు కబ్జాచేస్తే మాత్రం హైడ్రా, ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు. ఢిల్లీలాగా మన నగరం కలుషితం కావద్దని, కాలుష్య రహిత నగరంగా, విశ్వనగరంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని చూస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని అన్నారు. అంతకుముందు మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ గత వనమహోత్సవంలో నాటి మొక్కల్లో 94 శాతం పెరుగుతున్నాయని అన్నారు. గుర్రంగూడలో రెండు దశాబ్దాల న్యాయపోరాటం అనంతరం 102 ఎకరాల భూమి అటవీ శాఖకు దక్కిందన్నారు. 420 ఎకరాల భూమిని అటవీశాఖ రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించడం జరిగిందన్నారు. ప్రకృతి అనుభూతిని అందించేలా ఇక్కడి పార్కును అభివృద్ధి చేస్తామని అన్నారు. వేలాది ఎకరాల అటవీ సంపదను ప్రభుత్వం కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటాలని, పచ్చని తెలంగాణ, సుసంపన్న తెలంగాణ, ఆరోగ్య తెలంగాణాలో భాగస్వాములు కావాలని మంత్రి కొండ సురేఖ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చొరవతో గుర్రంగూడ భూమి అటవీశాఖకు దక్కిందన్నారు. బిఆర్ఎస్ నాయకులు అభివృద్ధికి అడ్డుతగులుతున్నారని, హైడ్రాను కూడా రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాగా అంతకు అటవీశాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. రోబోటిక్ ఎలిఫెంట్‌ను ప్రారంభించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, కార్పొరేషన్‌ల చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాల్వ సుజాత, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు, తదితరులు పాల్గొన్నారు.

**424.31 ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ పార్కు..**

గుర్రంగూడలోని 424.31 ఎకరాల అటవీ ప్రాంతాన్ని జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యవరణ పునరుద్ధరణతో అర్బన్ ఫారెస్ట్ పార్కుగా అభివృద్ధి చేయనున్నారు. దీనిలో భాగంగా రూ.11.57 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అదనంగా రూ.6.27 కోట్ల వ్యయంతో పర్యావరణ పరిరక్షణ పనులు చేపట్టనున్నారు.

## 30న మధిరలో రైతుల సమ్మేళనం

>> ముగిసిన అనంతరం కేబినెట్ సమావేశ వివరాలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(నీటిపారుదల), తుమ్మల నాగేశ్వరరావు(వ్యవసాయం), సీతక్క(పంచాయతీరాజ్) మీడియాకు తెలియజేశారు. రైతులు పండించే సన్న దాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే బోనస్ ఏడు రకాల సన్నాలకు మాత్రమే ఇవ్వాలని మంత్రుల సమావేశం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మార్కెట్లో ఆ వెరైటీలకు ఉన్న డిమాండ్, ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం7715... ఈ ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మన రైతులు ఈ ఏడాది దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం పండించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని మంత్రులు పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయించిన విధి విధానాల ప్రకారం రాష్ట్రంలోనూ పంట ఉత్పత్తులను కొనుగోలు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోలుకు కేంద్రం నిర్దేశించిన కోటాను అనుసరించాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఇకపై కేంద్రం ఏయే పంట ఉత్పత్తులకు ఎంఎస్‌పి నిర్ణయించి, కొనుగోలు చేస్తుందో.. ఆ పంటలను అంతే కోటాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే ఎరువుల కోటాను విడుదల చేయాలని త్వరలోనే ఢిల్లీకి వెళ్లి మరోసారి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామని ప్రకటించారు. మన రాష్ట్రంలో ఉన్న రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ కంపెనీ లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అత్యధిక కోటా మన రాష్ట్రానికే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ఏ మధ్యప్రదేశ్ కో, బీహార్ కో పంపించకుండా మన రాష్ట్రానికే ఇక్కడి యూరియాను కేటాయిస్తే రవాణా ఖర్చులు కూడా తగ్గిపోతాయన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి కొత్తగా కేంద్రం తెచ్చిన వీబీజీ రామ్ జీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని మంత్రులు పేర్కొన్నారు. కొత్త చట్టం అమలుతో కూలీలపైనా, రాష్ట్ర ప్రభుత్వంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. మెట్రో విస్తరణకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఐఆర్ఎఫ్‌సి నుంచి ఒప్పందం ప్రకారం రావాల్సిన రుణాన్ని వెంటనే మంజూరు చేయించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో కేబినెట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

హైదరాబాద్ ట్రాఫిక్, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా మెట్రో ఫేజ్ 2 విస్తరణ అత్యంత కీలకం. అందుకే మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలందరూ కూడా మెట్రో విస్తరణకు సహకరించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను పేపర్ లెస్ గా నిర్వహించే పద్ధతికి గురువారం నుంచి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగే కేబినెట్ సమావేశాలన్నింటినీ ఇకపై తెలంగాణ డిజిటల్ క్యాబినెట్ గా నిర్వహిస్తారు. గురువారం ఐటీ విభాగం తరఫున మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులు అందరికి స్పెషల్ ట్యాబ్ లు అందజేశారు. డిజిటల్ క్యాబినెట్ అమలు తీరును కూడా అందరూ స్వయంగా పరిశీలించారు. ఇకపై ఈ బుక్ ద్వారానే క్యాబినెట్ సమావేశం ఎజెండా.. నోట్స్ అన్నీ మంత్రులకు అందుబాటులో ఉంచుతారు. పేపర్ లెస్ గవర్నెన్స్‌లో భాగంగా తెలంగాణ డిజిటల్ క్యాబినెట్ అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలియజేయటం ఆనందంగా ఉంది.

ఇకపై కాగితాలతో పనిలేకుండా డిజిటల్ విధానంలో కేబినేట్ మీటింగ్ లు జరుగుతాయని మంత్రులు పేర్కొన్నారు. ఈ నెల 21న దేశమంతటా నీట్ పరీక్ష జరుగనుంది. రాష్ట్రంలో దాదాపు 208 పరీక్ష కేంద్రాల్లో 2 లక్షల 95 వేల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాస్తున్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం తరఫున నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు తెలిపారు. నీట్ పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్లు చూపించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## వానలు రాలె.. నీళ్లు లేవాయె!

>> 22.47టిఎంసిలు నీరు మాత్రమే ఉంది. ఎల్‌బిఎస్ ఆలమట్టి డ్యామ్ గరిష్టనీటి నిల్వసామర్థ్యం కాగా 129.72 టిఎంసిలు కాగా గత ఏడాది జూన్ 18 నాటికి 66,55టిఎంసిల నీటినిల్వ వచ్చిచేరింది. నారయణపూర్‌లో 37.64టిఎంసి గరిష్ట నీటినిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం అందులో 24.44టిఎంసిలునీరు మాత్రమే ఉంది. గతేఏడాది ఇదే సమయంలో 29.79టిఎంసిల నీరు ఉంది. ఉజ్జయిని ప్రాజెక్టులో117.24 గరిష్టనీటి నిల్వసామర్థ్యం ఉన్నప్పటికి అందులో 50టిఎంసలు మాత్రమే ఉంది. గతేడాది ఇదే సమయంలో 92.90టిఎంసిల నీరు ఉండేది. గత ఏడాది ఎల్‌బిఎస్ ఆలమట్టి రిజర్వాయర్ నుంచి జూరాలవరకు ఉన్న క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షం కురియడంతో ఎగువ నుంచి వచ్చి వరద వచ్చిచేరడంతో జూరాల గేట్లు జూన్ రెండోవారం వరకు రెండుసార్లు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలచేశారు. ప్రస్తుతసీజన్‌లో 7.39 టిఎంసిలనీరు ఉంది. జూన్5న కురిసిన తొలకరితోనే ఏకంగా 4500 క్యూసెక్కుల వరదనీరు నీరు వచ్చి చేరడంతో జూరాలకు జలకళ సంతరించుకొంది. జూరాల సమీపంలోని భీమా,నెట్టంపాడు,కోయిల్‌సాగర్,సంగంబండ, ర్యాంపాడు,గుడ్డెందొడి,భూత్‌పూర్ వంటి 11 జలాశయాలు ఐదు టిఎంసిలనీరు కూడా లేకపోవడంతో దాదాపు డెడ్ స్టోరేజిలోనే ఉన్నాయి. తుంగభద్రలో 9టిఎంసిలు మాత్రమే నీరు ఉంది ఇక శ్రీశైలంలో 215 టిఎంసిలకు గాను 42టిఎంసి నీరు ఉంది. గత ఏడాది 68 టిఎంసిలు అందులో ఉండేది. నాగార్జునసాగర్‌లో 312టిఎంసిల గరిష్టనిల్వ ఉండాల్సిఉండగా 142.79 ఉంది పోయిన ఏడాదితో పోల్చితే 4టిఎంసిలు ఎక్కవనేఉంది. మహారాష్ట్ర గైక్వాడ్ ప్రాజెక్టులో 102టిఎంసిల గరిష్ఠనీటి నిల్వసామర్థ్యంకు గాను ప్రస్తుతం 47టిఎంసిలనీరు ఉండగా గత ఏడాది 48.80టిఎంసిల నీరు ఉండేది. సింగూర్ గరిష్టనీటి సామర్థ్యం 29టిఎంసిలు కాగా గత ఏడాది 19.44టిఎంసిలు ఉంటే ప్రస్తుతం 4టిఎంసిల నీరు ఉంది. నిజామ్‌సాగర్‌లో గత ఏడాదికంటే 0.53టిఎంసిల నీరు అధికంగాఉంది, శ్రీరాంసాగర్‌లో కూడా గతేడాది కంటే 2టిఎంసిలనీరు అధికంగాఉంది. ఎస్ఆర్ఎస్‌పిలో 15.15టిఎంసిల నీరు ఉన్నప్పటికి పూడిక సుమారు 6టిఎంసి నీటి నిల్వకోల్పోయేలా పేరుకుపోయింది. అంటే ఎస్సారెస్పీలో 9టిఎంసిల నీరు మాత్రమే ఉండే అవకాశం ఉంది. శ్రీపాద ఎల్లంపలిలో 7.48 టిఎంసిల నీరు ఉండటంతో పెద్దపల్లి,రామగుండంకు తాగునీటికష్టాలు మొదలవుతుందా అని భయాందోళన చెందుతున్నారు.పోయిన ఏడాది శ్రీపాద ఎల్లంపల్లిలో 8.73టిఎంసిలనీరు నిల్వఉంది. గోదావి డెల్టాలో కూడా నీరు ప్రమాదకరంగా తగ్గిపోతున్నది. తెలంగాణలో గత ఏడాది 38.7 సెం.గ్రే ఊష్ణోగ్రత నమోదైతే ప్రస్తుతం 42.1 సెంగ్రే సగటు ఊష్ణోగత్ర నమోదైంది. నీటి ఆవిరిశాతం కూడా పెరిగిపోతున్నది. హైదరాబాద్‌లో 13218 అపార్టుమెంట్స్‌లో బోర్లు ఎండిపోయాయి, కరీంనగర్ ఎల్ఎండి ఆనుకొని ఉన్నకోతిరాంపూర్, అలకాపురికాలనీ, పోచమ్మవాడలో కూడా బోర్లు ఎండిపోయి ప్రమాద ఘంటికలు మ్రోగిస్తోంది.

## ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు ఈ'సారీ'!

>> తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు 'బి' కేటగిరీ సీట్ల అక్రమాలపై తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టిఎఎఫ్ఆర్‌సి)కి ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదులు చేశారు. ఉన్నత విద్యామండలి ఉన్నతాధికారులు ఈ యేడాది 2026-27 విద్యా సంవత్సరం నుంచి 'బి' కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. 'బి' కేటగిరీ అడ్మిషన్లలో అక్రమాలు జరుగుతున్నాయని, మెరిట్ విద్యార్థులకు న్యాయం జరగడం లేదని తమకు ఫిర్యాదులు అందాయని, అందుకే ఈ ఏడాది నుంచి 'బి' కేటగిరీ సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో చేపట్టేలా చూస్తామని మీడియా ముఖంగానే ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రకటించారు. కానీ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఈ నెల 8న జారీ చేశారు. ఈ నెల 19 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ప్రతి ఏడాది కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయిన తరువాత 'బి' కేటగిరీ సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేసేవారు. కానీ ఈ యేడాది మాత్రం కన్వీనర్ కోటా సీట్ల కౌన్సెలింగ్‌తోపాటు సమాంతరంగా 'బి' కేటగిరీ సీట్ల భర్తీ ప్రక్రియ కూడా కొనసాగుతుందని ప్రకటించారు. దీంతో ఈ ఏడాది గతంలో కంటే ముందుగానే ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు తమ మేనేజ్‌మెంట్ కోటా ('బి' కేటగిరీ) సీట్ల అడ్మిషన్ల ప్రక్రియను త్వరగా ముగించుకోవడానికి అవకాశం కల్పించారు. 'బి' కేటగిరీ సీట్ల ద్వారా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు వందల కోట్లను విద్యార్థుల నుంచి దండుకోనున్నారు.

గత రెండు, మూడు సంవత్సరాలుగా ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియను పరిశీలిస్తే.. సుమారు 1.15 లక్షల నుంచి 1.20 లక్షల సీట్లు అందుబాటులో ఉంటున్నాయి. వీటిల్లో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా ('బి' కేటగిరీ) సీట్లు ఉంటాయి. అంటే సుమారు 30వేల నుంచి 32 వేల వరకు 'బి' కేటగిరీ సీట్లు అందుబాటులో ఉంటాయి. వాటిలో సుమారుగా 25వేల నుంచి 27వేల వరకు సీట్లు భర్తీ అవుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 'బి' కేటగిరీలో ఎఎఫ్ఆర్‌సి నిర్ణయించిన ఫీజు కాకుండా డొనేషన్ రూపంలో అదనంగా ఫీజును వసూలు చేస్తారు. అలా అదనంగా వసూలు చేసే ఫీజు రూ.1 లక్ష నుంచి రూ.15 లక్షల వరకు ఉంటుంది. సిఎస్ఇ బ్రాంచ్‌లకు అయితే ఇదికాస్త రూ.20 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. వీటిని పరిశీలిస్తే సరాసరి ప్రతి విద్యార్థి నుంచి రూ.2 లక్షలు అదనంగా వసూలు చేసిన సుమారు రూ.540 కోట్లు అవుతుంది. అదనంగా వసూలు చేసే ఫీజులతో వందల కోట్లను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. గత ఏడాది కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు 'బి' కేటగిరీ సీట్ల అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వకుండానే అడ్మిషన్లను చేపట్టారని తమకు న్యాయం చేయాలని కోరుతూ టిఎఎఫ్ఆర్‌సికి ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘాలు సైతం ఇదే విధమైన ఫిర్యాదులను అటు టిఎఎఫ్ఆర్‌సికి, ఇటు ఉన్నత విద్యా మండలికి కూడా చేశారు. 'బి' కేటగిరీ సీట్లపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండటంతో అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేయడానికి ప్రయత్నిస్తామని ప్రకటించిన ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది కూడా 'బి' కేటగిరీ సీట్ల భర్తీకి గతం కంటే ముందుగానే అనుమతి ఇచ్చింది. ఈ విషయమై ఉన్నత విద్యామండలి అధికారులను వివరణ కోరగా.. ఆలస్యం అయితే మెరిట్ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అందుకే ముందుగానే అనుమతులు ఇచ్చామని తెలిపారు.

## భారత్-ఇయు మధ్య చారిత్రాత్మక ఎఫ్‌టియే

>> ఫ్రాన్స్ ఒక కీలక వారధిగా మారి, భారత్ మరియు యూరప్ టెక్ ఎకోసిస్టమ్‌లను మరింత దగ్గర చేస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, డిజిటల్ సహకారం వంటి రంగాల్లో భారత్‌ఫ్రాన్స్ భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూరప్‌లోనే అతిపెద్ద సాంకేతిక ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ వివాటెక్ 10వ ఎడిషన్‌లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. సదస్సుగా పేరుగాంచిన వివాటెక్ విజయవంతంగా నిర్వహించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తోపాటు నిర్వాహకులను మోడీ అభినందించారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50

ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర: మంత్రి సీతక్క 6

40 వేల మెట్రిక్ టన్నుల యూరియా కోత



ఒప్పందంపై ట్రంప్ సంతకం



ప్రదర్శిస్తున్న పెజెష్కియాన్

ట్రంప్, పెజెష్కియాన్ వర్చువల్‌గా సంతకాలు

# పీస్ డీల్




అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

తక్షణమే అమల్లోకి.. పశ్చిమాసియాలో సైనిక చర్య ముగింపు

నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు.. 60 రోజుల్లో తుది ఒప్పందం

తెరుచుకున్న హార్ముజ్ జలసంధి.. తగ్గిన ముడిచమురు ధరలు

**పారిస్, జూన్ 18:** అమెరికా- ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరు దేశాల అధ్యక్షులు చారిత్రాత్మక మైత్రి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు చేశారు. అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు 19వ తేదీన ఇరు దేశాలు అధికారికంగా శాంతి ఒప్పందం చేసుకోనున్నాయి. 14అంశాల ఆధారంగా ఇరు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. గురువారం ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసోద్ పెజెష్కియాన్ వర్చువల్ పద్ధతిలో 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. గత కొంతకాలంగా కొనసాగుతున్న శత్రుత్వానికి బ్రేక్ వేస్తూ జరిగిన ఈ ఒప్పందం అంతర్జాతీయ దౌత్య రంగంలో ఒక ముందడుగుగా నిలిచింది. ఫ్రాన్స్‌లోని వర్సాలీస్ ప్యాలీలో జరిగిన ప్రత్యేక విందు సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సమక్షంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందంపై సంతకం చేయగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కియాన్ కూడా టెహ్రాన్ నుంచి >>7

---

ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు

# ఈ 'సారీ'!

**కన్వీనర్ కోటాతోపాటు 'బి' కేటగిరీ సీట్ల భర్తీకి అనుమతి**

ఉన్నత విద్యామండలి నిర్ణయంపై విద్యార్థి సంఘాలు మండిపాటు

ఆలస్యమైతే విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్తారనే అనుమతిచ్చామని అధికారుల వివరణ

నేటి నుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 'బి' కేటగిరీ (మేనేజ్‌మెంట్ కోటా) సీట్ల భర్తీ ఇష్టానుసారంగా జరుగుతోందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇంజనీరింగ్ 'బి' కేటగిరీ సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో చేపట్టాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు 'బి' కేటగిరీ సీట్ల అడ్మిషన్ల ప్రక్రియలో కోట్లాది రూపాయలను దండుకుంటున్నాయని విద్యార్థిసంఘాలు, తల్లిదండ్రులు, రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. మెడికల్ సీట్ల 'బి' కేటగిరీ అడ్మిషన్ల మాదిరిగానే ఇంజనీరింగ్‌లోనూ ఆన్‌లైన్‌లో మెరిట్ విద్యార్థులతో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి అమలుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడలేదు. గత రెండు మూడు సంవత్సరాలుగా విద్యార్థుల >>2

---



సచివాలయంలో గురువారం సమీక్షలో మంత్రి పొన్నం

ఆర్టీసీ ఉద్యోగులకు

# 11% ఫిట్‌మెంట్

జూలై 1 నుండి అమలు

త్వరలో గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్

ఆర్టీసీ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 18:** ఆర్‌టీసీ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎఫ్ 2021కి 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుండి అమలు చేయాలని అధికారులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్‌టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియకు షెడ్యూల్‌ను విడుదల >>2

---

30న మధిరలో రైతుల

# సమ్మేళనం



ఆ సభలోనే రైతు భరోసా నిధులు విడుదల

హైదరాబాద్‌లో గురువారం జరిగిన డిజిటల్ కేబినెట్ భేటీలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రులు

ఇక కేంద్రం నిర్దేశించిన కోటా ప్రకారమే పంట కొనుగోలు

7 రకాల సన్నాలకే బోనస్, ఇప్పటికే 80లక్షల మె.ట కొనుగోలు

ఎరువుల కోటా విడుదల కోసం ఢిల్లీకి వెళ్లి మరోసారి విజ్ఞప్తి

విబిజి రామ్‌జి పథకం ప్రభావంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

మెట్రో అనుమతులు ఇప్పించేందుకు బిజెపి ఎంపీలు రావాలి

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం

తెలంగాణ డిజిటల్ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులకు స్పెషల్ ట్యాబ్‌లు అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్18:** వానాకాలం పంటలకు రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులను విడుదల చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్వర్యంలో గురువారం సచివాలయంలోజరిగిన (డిజిటల్‌కేబినెట్) మంత్రుల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో భారీ ఎత్తున రైతుల సమ్మేళనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులతో ఆరోజు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి.. అదే వేదిక నుంచి రైతు భరోసా నిధులను పంపిణీ చేయాలని ఈ సమావేశం నిర్ణయించింది. అదే వేదిక పై నుంచి రైతు భరోసా నిధులను రాష్ట్రంలోని రైతులఖాతాలో జమ చేయటం ప్రారంభమవుతుంది. మంత్రివర్గ సమావేశం >>2

---

ఎవరు అడ్డుపడిన ఫ్యూచర్ సిటీని

# నిర్మించి తీరుతాం..

అడ్డంకులు సృష్టిస్తున్న ప్రతిపక్షాలు

వారిని ప్రజలు తిరస్కరించారు

హైదరాబాద్‌ను హరిత వనంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: సిఎం రేవంత్

**సైదాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** ఫ్యూచర్ లేని వాళ్లు ఫ్యూచర్ సిటిని అడ్డుకోవాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ అటవీ ప్రాంతంలో వనమహోత్సవం 2026ను ముఖ్యమంత్రి >>2

---

భారత్- ఇయు మధ్య

# చారిత్రాత్మక ఎఫ్‌టిఏయే

వివాటెక్ సదస్సులో ప్రధాని మోడీ

**ప్యారిస్,జూన్ 18:** ఫ్రాన్స్‌లో నిర్వహించిన వివాటెక్ 10వ ఎడిషన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ప్రధానిమోడీ యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో అధ్యక్షుడు మాక్రాన్, నిర్వాహకుల కృషి అభినందనీయమని అన్నారు. అలాగే 2026 సంవత్సరం భారత్ యూరప్ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ఏడాదిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో భారత్‌యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులను మరింత విస్తరించడమే కాకుండా ప్రతిభ, సాంకేతికత, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను తెరుస్తుందని మోడీ వెల్లడించారు. అదేవిధంగా, ఇండియాఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ఇన్నోవేషన్ ప్రారంభంతో భారత్, యూరప్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది >>2




వివాటెక్ సదస్సులో ప్రధాని మోడీ

---

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం

# కట్టుబడి ఉంది

అసంపూర్తిగా ఉన్న గురుకులాలపై ప్రత్యేక దృష్టి

క్రిష్టియన్ మైనార్టీల సంక్షేమానికి రూ.50 కోట్లు

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



మైనార్టీల సమీక్షలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి విక్రమార్క సమావేశం నిర్వహించారు. ఉర్దూఅకాడమీ స్వర్ణోత్సవాలసందర్భంగా హైదరాబాద్‌తో పాటు, అన్ని జిల్లాకేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున కవి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులనుఆదేశించారు. దేశంలోనే >>2

---

# రిజిస్ట్రేషన్లు 3 రోజులు బంద్



**26 నుంచి 28 వరకు సేవలకు తాత్కాలిక విరామం**


29 నుంచి యథావిధిగా సేవలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్18:** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవల గురించి ఆ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం కీలక ప్రకటన చేశారు. షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా సేవలు అందుబాటులో ఉండవని వెల్లడించారు. సుమారు ఐదు సంవత్సరాల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్వహణ పనుల అనంతరం సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడటం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమని ఆయన పేర్కొన్నారు. నిర్దిష్ట తేదీలనే ఎంచుకోవడానికి గల కారణాలను ఐజీ వివరించారు. ఈ నెల 26న మొహర్రమ్, జూన్ 28న ఆదివారం కారణంగా ఈ రెండు రోజులు ప్రభుత్వ సెలవు ఉందని చెప్పారు.

మధ్యలో ఉన్న శనివారం (జూన్ 27) ఒక్కరోజులో మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా సర్వర్ నిర్వహణ షెడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

---

# వానలు రాలె.. నీళ్లు లేవాయె!



ప్రమాదకర స్థాయిలో జలాశయాల నీటి నిల్వలు

పెద్దపల్లి, జగిత్యాల, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో అతిభారీగా లోటు వర్షపాతం

**హైదరాబాద్,జూన్18, ప్రభాతవార్త:** గాడ్జిల్లా ఎల్‌నీనో ప్రభావంతో తెలంగాణతో పాటు కర్నాటక, మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో గోదావరి, కృష్ణా బేసిన్‌లోని చిన్న,మధ్యతరహా,భారీ జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకరస్థాయిలో పడిపోతున్నాయి. గత ఏడాది కృష్ణా, గోదావరి బేసిన్‌లోని 18 ప్రధానరిజర్వాయర్లలో గత ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురుస్తుండటంతో నీరు వచ్చిచేరడం మొదలైంది. పోయిన ఏడాది జూన్ 18న ప్రధాన జలాశయంల్లో గరిష్టంగా 793.94టిఎంసిల నీరు ఉండాల్సి ఉండగా 307.07 టిఎంసిలనీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం 279.30టిఎంసిలు మాత్రమే అందులో ఉంది. పూడికను వదిలేస్తే జలాశయాల్లో నికరంగా 143 టిఎంసిలు మించి నీటినిల్వలు ఉండకపోవచ్చు. కృష్ణా బేసిన్‌లో అత్యధికవర్షాలు పడటంతో గతఏడాది జూన్ మొదటివారంలోనే జూరాల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. గోదావరి బేసిన్‌లో దిగువన వర్షాలు కురవడంతో భద్రాచలం నుంచి నీటి ప్రవాహం ఉండేది. ఎల్లంపల్లి,ఎస్సారెస్పీ,గైక్వాడ్ ప్రాజెక్టుల్లో ఆగస్టు రెండోవారం వరకు నీరు ఆశించనరీతిలో చేరుకోలేదు. గోదావరి బేసిన్‌లోని చెరువులు కుంటలు పడిన కొద్ది పాటి వర్షంతో నీరు చేరుకోవడంతో ప్రధాన రిజర్వాయర్లలో నీరు లేకపోయినా సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా ఖరీఫ్ ఏరువాక మృగశిర కార్తెనుంచి జోరుగా సాగించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం రుతుపవనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో గత ఏడాదితో పోల్చితే తెలంగాణ వ్యాప్తంగా నాగర్‌కర్నూల్ రంగారెడ్డి రెండు జిల్లాలు మినహా మిగితా జిల్లాలో తీవ్రవర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. కర్నాటకలో వర్షాలు పడకపోవడంతో లాల్ బహదూర్ శాస్త్రి ఆలమట్టిలో >>2

---

# సర్‌పై బి అలర్ట్

బిఎల్‌ఎ 2ల లిస్ట్ ఇఆర్వోలకు అందించాలి

మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్

**హైదరాబాద్,జూన్ 18,ప్రభాతవార్త:** ఓటరు సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగించకుండా బూత్ లెవెల్ ఏజెంట్‌లు చురుకుగా ఉండేలా నియోజకవర్గ ఇంచార్జ్‌లు పని చేయాలనీమంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పిలుపు నిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ నాయకులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ గురువారం >>2


వార్త

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.

-ఆస్కార్ వైల్డ్


# అప్రమత్తతే అసలైన మందు!

దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు, అటు కేంద్ర ప్రభుత్వం కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి.మన రాజ్యాంగనిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో స్పష్టంగాపొందుపరిచారు. ఇన్ని దశాబ్దాలు గడిచిపోయినా అందరికీ సంపూర్ణ ఆరోగ్యం సంగతి దేవుడెరుగు. కనీస ఆరోగ్యవసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది.కొన్ని వ్యాధులను నియంత్రించడం వైద్యులకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, కొత్త చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్తకొత్త వ్యాధులు విస్తరిస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్నే చిగురుటాకులా వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది కోలుకోలేకపోతున్నారు.గుండెజబ్బులు పెరిగిపోయాయి. వయసుతో తేడాలేకుండా చిన్నాపెద్ద అందరూగుండెజబ్బులకు బలైపోతున్నారు. ఇక కిడ్నీవ్యాధుల గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్రం కిడ్నీవ్యాధుల్లో అగ్రస్థానంలో ఉన్నట్లు ఇటీవల వెల్లడించిన సర్వేలు స్పష్టం చేశాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్ని పెట్టినా సరిపోవడం లేదు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. వర్షాకాలం సీజన్ ఆరంభం కావడంతో కొత్త నీరు రాక,పాత నీరు కలయికతో వ్యాధులు విస్తరిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరించే ప్రమాదం ఉన్నట్లు వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎబోలా వ్యాధి దేశంలో అంతగా విస్తరించకపోయినా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా దేశంలో కొన్ని ప్రాంతాల్లో సోకుతున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎబోలా వ్యాధి సోకిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు.ఒక్కఅల్లోపతి డాక్టర్లే కాదు, ఆయుర్వేదం,హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు, వైద్యరంగ నిపుణులు, శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాలని సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈ విషయం కొత్తగా చెప్పడం లేదు.దశాబ్దాల తరబడి చెప్తూనేఉన్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలియనవి కావు. అయినా రోగ నిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు? కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన సమయం ఇది.శరీరంలో రోగనిరోధక శక్తినిఒక్క రోజుల్లోనో, ఒక్క వారంలోనో, ఒక్క నెలలో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమ టించేవారు కోట్లసంఖ్యలో ఉన్నారు. వారిలో రోగనిరోధక శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? మరోపక్క కాలుష్యం ప్రజా రోగ్యాన్ని కాటువేస్తున్నది. ఢిల్లీలో చలికాలం వాయు కాలుష్యం చుట్టుముట్టడం ఆ పౌరులను ఉక్కిరిబిక్కిరి చేయడం ప్రతి యేడాది జరుగుతూనే ఉన్నది. ఢిల్లీలోనే కాదు భారతదేశంలోని అనేక నగరాలు, పట్టణాలు, వాయు, నీటికాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. మరొకపక్క వాహన కాలుష్యం దీనికితోడవుతున్నది. వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడంలేదు. అన్నిటికంటే మించి కేన్సర్ వ్యాధి మానవాళిపై పంజా విసరడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల కేన్సర్‌కు సంబంధించి మందుల ధరలు ఒక్కసారిగా పెంచారు. ఇది మరింత ఆర్థిక భారం పడిందనే చెప్పొచ్చు. దేశంలో నాలుగేళ్ల క్రితం పద్నాలుగు లక్షల అరవైవేలకుపైగా కేన్సర్‌కేసులు నమోదు కాగా ఇప్పుడది మరో నాలుగులక్షలకు అదనంగా నమోదవుతున్నట్లు వైద్య పరిశోధన మండలి, జాతీయ కేన్సర్ నమోదు కార్యక్రమం లెక్కలు చెబుతున్నాయి. ఈ కేన్సర్‌ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు జాతీయ ఆరోగ్య కమిషన్ పలుచర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం చెబుతున్నది. ధూమపానం ఈ కేన్సర్‌ను పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం వల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు,స్వరపేటిక కేన్సర్‌ల నుండి తప్పించుకోవచ్చునని డాక్టర్లు సూచిస్తున్నారు. మద్యపానం కూడా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియంది కాదు. ప్రజాసంక్షేమమే తమ లక్ష్యమని చెప్పుకునే పాలక పెద్దలు ఈ ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. ఇవేకాదు కల్తీ కూడా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజల అనారోగ్యానికి కారణాలవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. ప్రజారోగ్యానికి చేటు తెస్తున్న విధానాలకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది.



అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.

వార్విక్



ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.

ఎల్లెన్ గ్లాస్గో

# ప్రజావాక్కు

## సమన్వయంతో పనిచేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, యుద్ధ వాతావరణాలు నెలకొన్నప్పటికీ భారత్ అభివృద్ధిపథంలో స్థిరంగా ముందుకు సాగుతోందనినీతిఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి పేర్కొనడం ఆశాజనక పరిణామం.వికసిత భారత్‌లక్ష్యసాధనలో ఆర్థికసంస్కరణలు,స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు,యువతసాధికారత, మహిళల భాగస్వామ్యం,సహకార సమాఖ్యవ్యవస్థ కీలకపాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తే దేశం ప్రపంచ వేదికపై మరింత బలంగా నిలబడగలదు. మహిళల ఆధ్వర్యంలోని అభివృద్ధే వికసిత భారత్‌కు పునాదిగా మారుతుందని ప్రధాని చెప్పిన మాటల్లో గొప్ప దూరదృష్టి కనిపిస్తోంది. వ్యవసాయం,వ్యాపారం,శాస్త్రసాంకేతిక రంగాలు, నవీన ఆవిష్కరణలలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు.అదే సమయంలో మహిళల అభివృద్ధికోసం నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధిశిక్షణ,భద్రతా చర్యలు,ఉద్యోగినుల వసతి గృహాలు,డిజిటల్‌అక్షరాస్యతకార్యక్రమాలను విస్తరించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఫీజుల భారం

విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమైనది.విద్య మన సమాజ అభివృద్ధికి పునాది.అయితే ఇటీవలికాలంలో పెరుగుతున్న ఫీజులు మధ్యతరగతి దిగువమధ్యతరగతి తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి. పిల్లలకు మంచి విద్య అందించాలనే ఆశతో కుటుంబాలు తమ సామర్థ్యానికిమించి ఖర్చుచేయాల్సి వస్తోంది. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ఫీజుల విషయంలో సమతుల్యతఅవసరం.విద్యాసంస్థలు, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ముందుకుసాగాలి. సామాజిక బాధ్యతలో భాగంగా కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల భారం తగ్గించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## అభివృద్ధికి నోచుకోని గ్రామాలు..

దేశంలో ఇంకా చాలా గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలోఉన్నాయి.గ్రామాలకు నిధులు కేటాయించిన ఇంకా అభివృద్ధి చెందకుండా తగిన మంచినీరు మిగతా సౌకర్యాలకు నోచుకోలేని ప్రజలు ఎంతోమంది ఉన్నారు. సమస్యలను పరిష్కరించకుండా అలాగే వదిలేస్తే అభివృద్ధి కావడం అసంభవం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత!

ఈ మధ్యకాలంలో బ్యాంకులవారు ఎస్.ఎం.ఎస్. ఛార్జీల మోత మోగించడం మరీ ఎక్కువైంది. దీంతో ఎందుకు తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు మాటిమాటికీ కోత పడుతున్నదో తెలియని ఆగమ్యగోచర పరిస్థితుల్లో ఖాతాదారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే పరిస్థితి అనేది ఎలా తయారు అయ్యింది అంటే ఇంట్లో డబ్బు పెట్టుకుంటే రక్షణ సమస్య, అదే బ్యాంకులో వేసుకుంటే ఇలా తమ బ్యాంకు ఖాతాలోని డబ్బు కేంద్రప్రభుత్వం వారు అనుసరిస్తున్న కొన్ని అర్థం,పర్థంలేనిఅస్థవ్యస్థమైనవిధానాలు ఖాతాదారుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తున్నది.దీంతోప్రజల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యిలా తయారు అయ్యింది. అంటే మనం కష్టపడి సంపాదించుకొన్న సొమ్ము దొంగల పాలు అయినట్లు ఇలా ఎస్.ఎం.ఎస్‌ల రూపంలో బ్యాంకు వారికి మన సొమ్ము స్వాహా అయిపోతుండటం మరీ విడ్డురమైన విషయం. ఏది ఏమైనా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని ప్రజావ్యతిరేక నిర్ణయాల మూలాన బ్యాంకులలో డబ్బులు డిపాజిట్ చేయాలంటేనేప్రజలుఒకవిధమైనఅభద్రతాభావానికిగురవుతున్నారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

## గురుకుల కాలేజీ తరలించొద్దు

2026-27 విద్య సంవత్సరం నుండి జిల్లా కేంద్రంలో ఉన్న గురుకుల కాలేజీని మారుమూల గ్రామాలకు తరలించడం సరికాదు. విద్యార్థులకువసతి, రవాణా సౌకర్యం లేదు. తగిన సిబ్బంది అవసరం ఉంటుంది. నీటి వసతి, బిల్డింగ్, టీచింగ్ స్టాఫ్‌కు నివాస యోగ్యమైన వసతిఉండాలి. కనుక ప్రభుత్వం జిల్లా కేంద్రం లో ఉన్న గురుకుల కాలేజీలను మారుముల చిన్న గ్రామాలకు తరలింపు అనే ఆలోచన సరికాదు. ఈ విషయం ప్రభుత్వం విరామించుకోవాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటినుంచో సామాజిక,ఆరోగ్య,ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు, కానీదాని ప్రభావం సమాజంపై తీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తివల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తున్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాదిమంది మరణిస్తున్నారు. అయినా మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం కారణంగా ప్రభుత్వాలు పూర్తిగా నిషేధం చడంలో వెనుకడుగు వేస్తుంటాయి.

-కె. రామారావు, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రత్యామ్నాయ పంటలే పరిష్కారం

**ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను వంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాలంలో సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పనతోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచ గలదనడంలో ఎటువంటి సందేహం లేదు.**



రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహ భాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయా పజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు,భూతాపం (గ్లోబల్ వార్మింగ్)ప్రభావాలు, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీనిఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగువిధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకురావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది. శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీనపడతాయి.భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002లో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015,ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్రసంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభంకావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులుతొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75నుండి 100 మిల్లీ



మీటర్ల వరకు స్థిరమైనతగినంత వర్షపాతంనమోదై, భూమి లోపలి పొరల వరకు తేమచేరినట్లు నిర్ధారించుకున్నతర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలంగడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘకాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవడ మంచిది. ఇందుకోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటివారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి.ఎక్కువ నీరు,ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు,రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణ ధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్‌లో ఈచిరుధాన్యాలకు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. తెలుగురాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగుచేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభదశలోనూ, పూత,కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి.కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తిసాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది. ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తిచెప్పకతప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరిరకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక,నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంత కంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగా హనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు. ●

# పరిమితులతో డిజిటల్ అడిక్షన్‌కు చెక్!


డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

భారతదేశ వ్యాప్తంగా బాలలు,కౌమార దశ యువతలో క్రమంగా స్క్రీన్ టైమ్ పెరుగుతూ, డిజిటల్ వ్యసనం బారినపడుతూ, తమ ఆరోగ్యాలను మొగ్గ స్థాయిలోనే కోల్పోతున్నారని పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన 2025-26 ఆర్థిక సర్వే హెచ్చరికలు చేయడం గమనార్హం.స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, గేమింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లతో మితిమీరిన వాడకంతో వారి చదువులపైననే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలపై కూడా తీవ్రమైన దుష్ప్రభావాలను చూపుతున్నట్లు సర్వే పేర్కొంటున్నది. వయస్సు ఆధారిత డిజిటల్ పరిమితులను విధించవలసిన సమయం ఆసన్నమైనదని హెచ్చరికలు చేసింది. అపరిమిత డిజిటల్ వినియోగదారుల్లో అధికంగా బాలలు, కౌమార దశ పిల్లలు ఉండడంతో రేపటి భారత భవిష్యత్తు సంక్షోభంలో పడవచ్చుని, హానికరమైన కంటెంట్ ఉన్న యాప్‌ల్లో మునిగి తమ చిరు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. డిజిటల్ వ్యసనం మితిమీరితే పిల్లలు మానసిక క్షోభ, క్రియాత్మక బలహీనతలకు దారి తీస్తుందని సర్వే నిర్వచిస్తున్నది. డిజిటల్ అడిక్షన్ హద్దులు దాటితే ఏకాగ్రత క్షీణించడం, నిద్రలేమీ సమస్యలు ఉత్పన్నం కావడం,ఆందోళన, నిరాశ, ఒత్తిడి ప్రమాదకర స్థాయికి పెరగడం, విద్యార్జన కోరిక తగ్గడం, సామాజిక సంబంధాలు తగ్గడం, ఒంటరితనం వేధించడం, చురుకుదనం మాయంకావడం,నైపుణ్యాలు తగ్గడం,పనితీరు క్షీణించడం, ఉత్పాదకత తగ్గడం లాంటి పలు అనర్థాలు జరుగుతున్నట్లు గమనించారు. పెద్దల్లో సైతం డిజిటల్ స్క్రీన్ టైమ్ పెరగడంతో సైబర్ మోసాలు, బెదిరింపులు పెరగడం,ఆన్‌లైన్ ఖర్చులు పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఉత్పాదకత పడిపోవడం గమనిస్తున్నాం. డిజిటల్ అడిక్షన్ వలలో చిక్కి3నుంచి5 గంటలకు పైగా నీలి తెరల ముందు కూర్చున్న పిల్లల్లో శారీరక శ్రమతగ్గడం వల్లప్రమాదకర జీవనశైలి వ్యాధులు పెరగడం గమనిస్తున్నామని నిపుణులు హెచ్చరిస్తున్నారు.డిజిటల్ అడిక్షన్ దుష్ప్రభావాలను తగ్గించేందుకు 'డిజిటల్ ఫాస్టింగ్' వ్రతం చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఒక వ్యక్తి ప్రతి రోజు కొన్ని గంటల పాటు లేదా వారానికి 1లేదా 2రోజుల పాటుస్మార్ట్ తెరలకు దూరంగా ఉండడాన్ని డిజిటల్ ఫాస్టింగ్ (ఉపవాసం) అని పిలుస్తున్నాం. 2024లో భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 43శాతం సామాజిక మాధ్యమాలను వాడినట్లు సర్వేలు నిర్ధారిస్తున్నాయి. పాఠశాలల్లో శారీరక వ్యాయామం తప్పనిసరి చేయడంతో పాటు స్క్రీన్‌టైమ్ నిర్వహణపై తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని సూచిస్తున్నారు.దీనితోపాటుగా వయస్సును బట్టి డిజిటల్ యాక్సస్ విధానాలు,హానికర కంటెంట్ విపరీతాలను అదుపుచేయడం,స్క్రీన్ టైమ్‌ను విధిగాతగ్గించడం జరగాలి.ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్దిష్టవయస్సుకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలపై నిషేధంవిధించడం ఇతర దేశాలను మార్గదర్శకం చేయాలి. దక్షిణకొరియా సైతం షట్‌డౌన్ చట్టంద్వారామైనర్లుగేమింగ్ వెబ్‌సైట్లను వాడ కుండా పరిమితులు విధించడం హర్షదాయకం.ఇదేక్రమంలో సింగపూర్,ఫ్రాన్స్,స్పెయిన్, ఫిన్లాండ్, జపాన్, బ్రెజిల్, కొన్ని యూఎస్ రాష్ట్రాలు కూడా డిజిటల్ అడిక్షన్ విషయంలో తగుచర్యలను తీసుకుంటున్నాయి. ●

# అప్పుల పునాదులపై ఆశల సౌధం

నిలేష్

సొంతిల్లు..ప్రతి సామాన్యుడి జీవితంలో అతిపెద్ద కల. కానీ ఆ గూడు కట్టుకునే క్రమంలో మధ్యతరగతి ప్రజలు తమ బతుకుల్ని, పిల్లల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారన్నది ఇప్పుడు తీవ్రఆందోళన కలిగిస్తున్న అంశం. 'అందరికీ సొంతిల్లు', 'సులభమైన వాయిదాలు' అంటూ ఊరిస్తున్న ప్రకటనల వెనుక..రక్తం పీల్చుతున్న ఈఎంఐల వాస్తవ పరిస్థితులు మన కళ్లముందే కదలాడుతున్నాయి. ఒకప్పుడు రిటైర్మెంట్ వయసుకు దగ్గర పడుతున్నప్పుడు మాత్రమే సొంతింటి గురించి ఆలోచించేవారు. నేటి కార్పొరేట్ కల్చర్, బ్యాంకులు ఇస్తున్న భారీ రుణాలు, సమాజంలో పెరుగుతున్న పోటీతత్వం యువతనుపాతికేళ్లకే ఇంటి రుణాలవైపు నెడుతున్నాయి. స్తోమతకు మించి భవిష్యత్తులో రాబోయే జీతాన్ని ముందే లెక్కలేసుకుని లక్షలకు లక్షలు అప్పులు చేస్తున్నారు. కానీ ఊహించని ఆర్థిక మాంద్యాలు, ఉద్యోగాల్లో కోతలు వారి లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. నెల ఒకటో తేదీ రాగానే భయం వేస్తోంది. నా జీతం 60వేలు, అందులో 40వేలు ఈఎంఐకేపోతోంది. మిగిలిన 20వేలతో ఇంటి అద్దె, రేషన్, పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు' అంటూ సగటు ఓ ప్రైవేట్ ఉద్యోగి కన్నీటి పర్యంతమవడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఇది ఒక్కరి పరిస్థితే కాదు. చాలామంది జీవితాలు ఈఎంఐల కొరల్లో నలిగిపోతున్నాయి. నెలసరి వాయిదాలు చెల్లింపుల కోసం మధ్యతరగతి కుటుంబాలు తమ ప్రాథమిక అవసరాలను సైతం త్యాగం చేస్తున్నాయి. చిన్నచిన్న కోరికలను చంపుకుంటున్నాయి. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించే క్రమంలో పిల్లలను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయి. నెలవారీ వాయిదాల భయంతో పిల్లలను మంచి స్కూళ్లలో చదివించలేక సాధారణ పాఠశాలలకు మారుస్తున్న తల్లిదండ్రులు ఎందరో. అటు అప్పులు తీర్చలేని క్రమంలోఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించాల్సిన దుస్థితి బడుగు జీవులది. చిన్నపాటి జబ్బులొస్తే ఆసుపత్రికి వెళ్లకుండా మెడికల్ షాపుల్లో మందులు, మాత్రలు తెచ్చుకుని సర్దుకుపోవాల్సిన సందర్భాలు అనేకం. ఇక పెద్ద వైద్యంఖర్చు వస్తే అప్పుల పాలే గతి. సాధారణంగా మధ్యతరగతి వారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. బ్యాంకులోను తీసుకుని ఇల్లు కొన్నప్పుడు, ఆ ఆదాయంలో సగానికి పైగా నెలసరి వాయిదాలకే సరిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా జీతాలు పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల నెలాఖరు వచ్చేసరికి జేబులు ఖాళీ అవుతున్నాయి. అనుకోని వైద్య ఖర్చులు రావడం, ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురవడం, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు సగటు పేద, మధ్యతరగతి జీవిని మరింత కృంగదీస్తున్నాయి. ఇలాంటి చిన్నకుదుపు వచ్చినా సరే వారి ఆర్థిక ప్రణాళిక పేకమేడలా కూలిపోతోంది. నెలసరి వాయిదాలు సమయానికి చెల్లించలేక బ్యాంకుల నుంచి వచ్చే ఒత్తిళ్లు వారి ప్రశాంతతను పూర్తిగా దూరం చేస్తున్నాయి. వెంటా



డుతున్న ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్న అప్పులు ఒకపక్క ఇంటి ఈఎంఐ కట్టడానికి, మరోపక్క ఆ నెల గడవడానికి మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, అధిక వడ్డీలకు బయట అప్పులు చేయడం ప్రారంభిస్తారు. ఇది ఒక ప్రమాదకరమైన విషవలయం లాంటిది. ఒకఅప్పు తీర్చడానికి మరోఅప్పు చేయడం. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి అసలు కంటే వడ్డీలే భారంకావడం వంటి పరిణామాలు బలవన్మరణాలకు ఉసిగొలుపుతున్నాయి. మరో మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యం అనుకునే పరిస్థితికి దారితీస్తున్నాయి. ఈ చక్రంలో చిక్కుకుని నిత్యం అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువుపోతుందన్న భయంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కరోనా తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు, వ్యాపారాల్లో నష్టపోయిన వారు ఈఎంఐలు కట్టలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేకపోతున్నారు. ఒక్క నెల వాయిదా దాటితే చాలు.. బ్యాంకుల నుంచి వరుస ఫోన్ కాల్స్. రెండు నెలలు దాటితే ఇంటి ముందుకు రికవరీ ఏజెంట్లు. పరువుపోతుందనే భయంతో, ఆ క్షణానికి గట్టెక్కడానికి అప్పుల మీద అప్పులు, క్రెడిట్ కార్డుల మీద నగదు విత్‌డ్రాలు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు. 'సొంతిల్లు' అనే సామాజిక హోదా కోసం, ఏమాత్రం ఆర్థిక ప్రణాళిక లేకుండా వేసే అడుగులు జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని చెప్పడానికి అనేకమంది పేద మధ్యతరగతి జీవుల గాథలే సజీవ సాక్ష్యం. ఇల్లు కొనాలనుకునే ముందు మన స్తోమత ఏంటి? అత్యవసర పరిస్థితులు వస్తే తట్టుకునే ప్రత్యామ్నాయం ఉందా? అని ప్రతి ఒక్కరూ తమనుతాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. గృహ రుణం తీసుకునే సమయంలో నెలవారీ ఈఎంఐలు చెల్లించగలమనే నమ్మకం ఉన్నప్పటికీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోతుంటాయి. చాలా కుటుంబాలు ఇతర అవసరాలను వాయిదా వేసుకుంటూ, తమ కోరికలను త్యాగంచేస్తూ ఈఎంఐలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు అదనపు ఉద్యోగాలు చేయడం, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినప్పుడు ఈఎంఐలు చెల్లించడం కష్టసాధ్యమవుతోంది. నెలవారీ వాయి దాలు చెల్లించలేక బ్యాంకుల నుంచి నోటీసులు అందుకో వడం, జరిమానాలు పడటం, క్రెడిట్ స్కోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇళ్లను వేలం వేసే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. దీంతో సొంతింటి కల ఆనందాన్ని ఇవ్వాల్సిన చోట ఆందోళనలకు కారణమవుతోంది. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం, కానీ అది మన రోజువారీ ప్రశాంతతను హరించేదిగా మారకూడదు. తమ ఆదాయం, భవిష్యత్ అవసరాలను కచ్చితంగాఅంచనా వేసుకుని మాత్రమే ఇంటి బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి.కనీసం ఆరు నెలల ఈఎంఐలు, ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును అత్యవసర నిధిగా పక్కన పెట్టిన తర్వాతే ఇంటి లోన్‌కు వెళ్లడం సురక్షితం. అదే సందర్భంలో కలలు కనడం తప్పు కాదు, కానీ ఆ కలల సాకారం మన వర్తమానాన్ని, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేదిగా ఉండకూడదు. ●


ఎడిఇలకు యంత్రాలు, స్మార్ట్‌ఫోన్‌లు అందజేస్తున్న సిఇ పాండ్యానాయక్

# సైబర్‌సిటీలో విస్తృతంగా చెట్ల కొమ్మల కత్తిరింపులు

## ఫీల్డ్ సిబ్బందికి ఆధునిక యంత్రాలు, స్మార్ట్‌ఫోన్లు పంపిణి

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఛీఫ్ ఇంజినీర్ పాండ్యానాయక్

**హైదరాబాద్, జూన్ 18,ప్రభాతవార్త:** టిజిఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్‌డ్రైవ్ – వాక్ అలోంగ్ ది లైన్' కార్యక్రమంలో భాగంగా సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో విస్తృత స్థాయిలో ట్రీ ప్రూనింగ్, లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలు చేపట్టారు. చీఫ్‌ఇంజినీర్ (ఆర్‌ఆర్ జోన్) ఎల్. పాండ్య నాయక్ ఆధ్వర్యంలో కొండాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ, గచ్చిబౌలి సెక్షన్లలో విద్యుత్ లైన్లకు అవసరమైన భద్రతా క్లియరెన్స్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ స్థాయిలో నిర్వహణ పను లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లకు (ఏడిఈ) వివిధ రకాల ఆధునిక ట్రీ ప్రూనర్లు, స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా విద్యుత్ లైన్ల సమీపంలోని చెట్ల కొమ్మలను సురక్షి తంగా తొలగించడం, ఫీల్డ్ పరిశీలనలు, ఫిర్యాదుల పర్యవేక్షణ, పనుల ప్రగతి నివేదికలు, రియల్‌టైమ్ కమ్యూనికేషన్, డిజిటల్ మానిటరింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. విద్యుత్ వాహక తీగలు, స్తంభాలు, ఇతర పంపిణీ మౌలిక వసతులకు సమీపంగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా కండక్టర్లకు తగిలే ప్రమాదాలను నివారించడం, ఫీడర్ ట్రిప్పింగ్, ఫాల్ట్‌లు, విద్యుత్ అంతరాయాలను తగ్గించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేకించి ఈదురు గాలులు, వర్షాలు, తుఫానులు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విద్యు త్ సరఫరా వ్యవస్థకు కలిగే అంతరాయాలను నివారించడంలో ట్రీ ప్రూనింగ్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్) చంద్రశేఖర్, డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్) శ్యాంకుమార్, సైబరాబాద్ సిటీ పరిధిలోని ఏడీఈలు మాణిక్యాలు, కమలాకర్‌రెడ్డి, శివప్రసాద్, ఆదినారాయణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 1.50 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రైతు భరోసా నిధులు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. జూన్ 30నచేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్న మయ్యారు. విత్తనాలు నాటేందుకు రెడీ అవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా పథకం నిధుల కోసం చాలా మంది రైతులు ఎదురు చూస్తున్నారు. దీంతో ప్రభుత్వం రైతు భరోసా పథకం నిధుల విడుదలపై కీలక అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పథకం కింద మూడో విడత నిధుల విడుదలకు సర్కార్ సిద్ధమైంది. ఇందుకు గాను రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మధిరలో జరిగే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందిస్తోంది. ఏడాదిలో ఎకరానికి రూ.12 వేల చొప్పున, వానకాలం సీజనులో రూ.6 వేలు, యాసంగి సీజన్‌కు మరో రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేస్తోంది.


ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

# ఇఎస్‌ఐ డైరెక్టరేట్ ముట్టడి

## నర్సింగ్ అధికారులకు తక్షణమే పోస్టింగ్‌లు ఇవ్వాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ జూన్ 18, ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శాఖలో ఎంపికైన 2032 మంది నర్సింగ్ అధికారులకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం వందలాది మంది అభ్యర్థులు గురువారం ముషీరాబాద్‌లోని ఇఎస్ఐ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ఆందోళనలో రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. ఇప్పటికే ఇతర విభాగాల్లో నర్సింగ్ అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చారని, అయితే ఇఎస్ఐ ఆసుపత్రులకు ఎంపికైన 300 మంది అభ్యర్థుల విష యంలో జాప్యం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. పోస్టింగ్‌లు రాక అభ్యర్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని, తమ పిల్లలను పాఠ శాలల్లో చేర్పించలేక విద్యాభ్యాసం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కూడా పోస్టులను మంజూరు చేసి భర్తీ ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో అధికారులతో జరిపిన చర్చల అనంతరం, వచ్చే వారం రోజుల్లో పోస్టింగ్‌లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# ఒడిశాలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆపరేషన్

## రూ.2.5 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** గంజాయి సరఫరా ముఠాలపై ఈగల్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. రాష్ట్రంలో దొరికిన ముఠాల లింక్ ఆధారంగా ఒడిశా వెళ్లిన ఈగల్ ఫోర్స్ బృందం అక్కడ 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఒడిశాలో బలిమెల నుంచి జయపుర్ వరకు 80 కి.మీ. దూరం వెంబడించి గంజాయి తరలిస్తున్న వాహనాన్ని ఈగల్‌ఫోర్స్ టీం పట్టుకుంది. పోలీసులు వెంబడించడంతో వాహనం వదిలేసి బొలేరో డ్రైవర్ పరారయ్యారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 115 ప్యాకెట్లలో 500 కిలోల గంజాయి లభించింది. స్వాధీనం చేసుకున్న గంజాయిలో 90 ప్యాకెట్లు 5 కిలోల చొప్పున మరో 25 ప్యాకెట్లు 2 కిలోల చొప్పున ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనం ఒడిశాలోని గాంధీనగర్ వాసి అమీర్ అలీఖాన్ పేరుతో ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2.50 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గంజాయితోపాటు బొలెరో వాహనాన్ని ఒడిశాలోని కొరాపూట్ పోలీసులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారం భించారు. స్వాధీనం చేసుకున్న వాహనం ఒడిశాలోని నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన అమీర్‌అలీఖాన్ పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు.

# రాష్ట్రంలో లోటు వర్షపాతం

## సగటున -27 శాతంగా నమోదు

## ఆరు జిల్లాల్లో భారీగా 80 నుండి 60 శాతం లోటు

## మరో 14 జిల్లాలో 56 నుండి 20 శాతం తక్కువ

## మూడు జిల్లాల్లో మాత్రం సాధారణం కంటే మించిన వర్షాలు



**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రం రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో తొలకరి వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు నిరాశే ఎదురవుతోంది. వర్షాలు కురవకపోగా, సాధారణం కంటే మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మళ్లీ ఎండలు మండిపోతున్నాయి. మృగశిర కార్తెలో కురిసే వర్షాలతో ఆరుతడి పంటల సాగులో బిజీగా ఉండాల్సిన రైతులు పలు జిల్లాల్లో తొలకరి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్ర మొత్తం మీద సగటున -27 శాతం మేర లోటు వర్షపాతం చోటు చేసుకుంది. వానాకాలం సీజను ప్రారంభమైన ఈ నెల 1వ తేదీ నుండి గురువారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 72.1 మిల్లీ మీటర్ల మేర సాధారణ వర్షం నమోదుకావాల్సి ఉండగా, 52.8 మిల్లీ మీటర్లు మాత్రమే చోటు చేసుకుంది. రాష్ట్రంలోని కేవలం 3 జిల్లాల్లో మాత్రమే సాధారణం కంటే మించి అధిక వర్షపాతం రికార్డయింది. 6 జిల్లాల్లో ఒక్క చుక్క వర్షం కూడా కురవకపోవడంతో భారీ లోటు నమోదైంది. మరో 14 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ కురియడంతో అవి కూడా లోటులో ఉన్నాయి. అయితే మిగిలిన 10 జిల్లాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ వానాకాలం సీజను ప్రారంభమైనప్పటి నుండి గురువారం వరకూ రాష్ట్రంలోనే హన్మకొండ జిల్లాలో అత్యధికంగా -80 శాతం లోటు వర్షపాతం నమోదయింది. పెద్దపల్లి జిల్లాలో -71 శాతం, సిద్దిపేట్ జిల్లాలో -66 శాతం, జగిత్యాల జిల్లాలో -65 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో -64 శాతం, మహబూబాబాద్ జిల్లాలో -60 శాతంతో భారీ లోటు వర్షపాతంతో కొట్టుమిట్టాడుతున్నాయి. అలాగే వరంగల్ జిల్లాలో -56 శాతం, నిజామాబాద్‌లో -55 శాతం, జనగామలో -54 శాతం, భూపాలపల్లి, మంచిర్యాలలో -52 శాతం, కరీంనగర్, ఆసిఫాబాద్ జిల్లాల్లో -50 శాతం, మల్కాజిగిరి -45 శాతం, సిరిసిల్ల లో -44 శాతం, నిర్మల్‌లో -42 శాతం, భువనగిరిలో -40 శాతం, కామారెడ్డిలో -39 శాతం, ములుగులో -34 శాతం, మెదక్ జిల్లాలో -20 శాతం చొప్పున లోటు వర్షపాతం నమోదైంది. అయితే రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో సాధారణం కంటే మించి అత్యధికంగా 48 శాతం, రంగారెడ్డి జిల్లాలో 39 శాతం, ఖమ్మం జిల్లాలో 25 శాతం మేర సాధారణం కంటే మించిన అధిక వర్షపాతం చోటు చేసుకుంది. మరోవైపు ఉత్తరాది వైపు నుంచి వస్తున్న వడగాలుల తీవ్రత కారణంగా రాష్ట్రంలోని 246 మండలాల్లో వాతావరణ కేంద్రం వడగాలుల హెచ్చరిక జారీ చేసింది. గడచిన 24 గంటల్లో, రాష్ట్రంలోని సూర్యాపేట్ జిల్లా మామిళ్లగూడెంలో గరిష్ట ఉష్ణోగ్రత 43.6 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోగా, 30 జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు మించి నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే రెండు రోజుల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## సిపిఎం నేతలను కలిసిన మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

# ప్రజాసమస్యలపై కలిసి పనిచేద్దాం

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ గురువారం సీపీఐఎం నేతలతో సమావేశమయ్యారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ముఖ్యనాయకులతో భేటీ అయ్యారు. దేవ్‌జీతోపాటు రాజిరెడ్డి, చంద్రన్న, పద్మక్క, సంజీవ్, బండి ప్రకాష్ కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్, ఎండీ అబ్బాస్, సీనియర్ నాయకులు జి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్‌బాబు, మల్లు నాగార్జునరెడ్డి, పి ఆశయ్య, ఉడుత రవీందర్, ధర్మానాయక్, కోట రమేష్ పాల్గొన్నారు. భేటీ అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ .. దేశంలో మావోయిస్టులను ఏరివేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిరంకుశంగా చేపట్టిందని విమర్శించారు. సీపీఐ(ఎం), ఇతర వామప క్ష పార్టీలు, ప్రజాస్వామిక వాదులు కేంద్ర ప్రభుత్వ తీరును ఖండించారని అన్నారు. మావోయిస్టు పార్టీ నుంచి బయటకొచ్చిన వారు ప్రజాఉద్యమాల్లో నిలబడి ముందుకు రావాలని కోరారు. వారి మీద ఉండే ఆంక్షలను ఎత్తేయాలని సూచించారు. సామరస్యంగా సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పెరుగుతున్నాయనీ, పెట్టుబడిదారులు పెద్దఎత్తున దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. వాటికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు ముందుకొస్తున్నాయని చెప్పారు. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, మతోన్మాదానికి, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కలిసొచ్చే వారిని సీపీఐ(ఎం) ఆహ్వానిస్తుందని చెప్పారు. ఆపరేషన్ కగార్ సందర్భంగా వామప క్షాలు, కాంగ్రెస్, ప్రజాస్వామికవాదులు ఆ నిర్బంధాన్ని వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ఆ పార్టీలను కలవడంలో భాగంగానే మాజీ మావోయిస్టు నేతలు ఇక్కడికి వచ్చారని చెప్పారు. ప్రజా ఉద్యమాల్లో కలిసి పనిచేద్దామన్నారు. ఏ పార్టీలో చేరడం లేదనీ. ఈ విషయాలు చర్చించుకోవడానికి ఇది సరైన సందర్భం కాదని దేవ్‌జీ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో 825 కిలోల కల్తీ పన్నీర్ సీజ్

## డిసిపి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 18, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో వివిధ ప్రాంతాలల్లో కల్తీ ఆహార పదార్దాల ముఠాలు రెచ్చి పోతున్నాయి. తాజాగా కల్తీ పన్నీర్ తయారుదారుల గుట్టు రట్టు చేశారు. వారి నుంచి సుమారుగా 825 కిలలో కల్తీ పన్నీర్‌ను ఫుడ్‌స్టేఫీ- టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గురువారం బేగంబజార్ పోలీస స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫుడ్‌స్టేఫీ- టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాలల్లో ఫుడ్‌సేఫ్టీ-టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం నిర్వహించిన ఆకస్మిక దాడులలో సుమారు 45 ఔట్‌లైట్లు, 8తయారీ విభాగాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీలోన సుమారు 825 కిలోల బరువు గల కల్తీ, తప్పుడు బ్రాండింగ్‌గా అనుమానిస్తున్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు సూచన వినియోగదారులు కేవలం లైసన్స్ పొందిన విక్రేతల నుండి పన్నీర్‌ను కొనుగోలు చేయాలని కొనే ముందు లేబుళ్లు0 , గడువు, తయారీ తేదిలను చూడాలని ప్రజలకు సూచించారు. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లను ఆయన హెచ్చంచారు. చీజ్ అనలాగ్ ఉత్పత్తులపై సరైన ప్రకటనను, స్పష్టంగా ఉంచాలన్నారు. తప్పనిసరి లేబుల్, చెల్లుబాటు అయ్యే తయారీతేదిలు ఉండాలన్నారు. అనలాగ్ ఉత్పత్తులను ప్యాక్ చేయడం, లేదా పనీర్‌గా విక్రయించడం వంటి తక్షణమే నిలిపి వేయాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. వెజిటబుల్ ఫ్యాట్స్ (వనస్పతి కొవ్వులు), పాలు, కాని ఇతర పదార్దాలతోతయారు చేయబడిన 'చీజ్ అనలాగ్' ఉత్పత్తులను, ఎలాంటి సరైన ప్రకటనలు, సమాచారం లేకుండా పన్నీర్, మలైపనీర్, మిల్క్‌పనీర్‌గా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు డిసిపి గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు. ఇది ముమ్మాటికి తప్పు డు బ్రాండింగ్ పేరిట వినియోగ దారులను మోసం చేయడ మవుతుంద న్నారు. కొంత మంది ఫుడ్ బిజినెస్ ఆప రేటర్లు, (ఎఫ్‌బి ఓ)ఎస్ ఈచీజ్ అనలాగ్‌ను తయారీ దారుల నుండి, అంతే కాకుండా ఇతర రాష్ట్రాలైన తమిళ నాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సేకరించి పన్నీర్‌గా అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. ఇదే ఉత్పత్తిని లో ఫ్యాట్, పనీర్, మీడియం ఫ్యాట్ పనీర్ లేదా ఫ్రెష్ పన్నీర్ పేరిట అమ్మకాలు చేస్తు తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. విక్రయించే పన్నీర్‌కు ఎలా లేబుళ్లతో మార్కెట్ చేస్తున్నారన్నారు. వాటికి తేది, గడువు, బ్యాచ్ నెంబర్ లేకుండానే అమ్మకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎఫ్‌బిఓలు అధిక లాభాల కోసం వాటిని ఉద్దేశ పూర్వకంగా తప్పుగా చిత్రీకరిస్తూ పన్నీర్‌గా విక్రయాలు చేస్తున్నారని వెల్లడించారు. కొంత మంది తయారీ దారులు రిటైల్ షాపుల యాజమానులు చెల్లు బాటు అయ్యే (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసన్స్ లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు కూడా గమనించినట్లు వివరించారు. నిర్దిష్ట ఎఫ్‌బిఓలు చీజ్‌అనలాగ్‌ను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, ఎలాంటి, లైసన్స్, సరైన ప్రకటన లేదా, ట్రెసిబిలిటి లేకుండా ప్రిమియం పన్నీర్ వంటి తప్పుదోవ పట్టించే లేబుళ్లతో తిరిగి ప్యాకింగ్ చేస్తున్నట్లు చెప్పారు. పోలీసుల తనిఖీలలో పన్నీర్‌లో పిండిపదార్దాం, అధిక నీరు, పాలు కాని ఇతర కొవ్వుల కలయిక, నాణ్యత లేని లేదా సింథటిక్ పాలు, నాన్- ఫుడ్-గ్రేడ్ రసాయనాలను ఉపయోగించడం వంటి కల్తీ పద్ధ తులు వెలుగులోకి వచ్చి నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, (ఎఫ్ఎస్ఎస్ఏఐ)పాల్గొన్నారు.


కల్తీ పన్నీర్ తప్పుడు బ్రాండింగ్ స్వాధీనం చేసుకుని చూపిస్తున్న డిసిపి వైభవ్ గైక్వాడ్

# గాదె ఇన్నయ్యపై చార్జ్‌షీట్ దాఖలు చేసిన ఎన్ఐఎ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. యుఏపిఏ చట్టాన్ని ఉల్లంఘించారంటూ 21, డిసెంబర్ 2025న ఆయనను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు ముగించి గురువారం నాంపల్లిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఛార్జ్‌షీట్‌లో ఎన్ఐఏ పలు కీలక అంశాలను వెల్లడించింది. 2025 అక్టోబర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కథా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో ఇన్నయ్య రెచ్చగొట్టే ప్రసంగం చేసినట్లు ఎన్ఐఏ తన ఛార్జ్‌షీట్‌లో ఆరోపించింది. మావోయిస్టు సిద్ధాంతాలను ప్రచారం చే యాలని 200 మం దిని ఆయన ప్రేరే పించినట్లు పే ర్కొంది. వి ప్లవం చని పోకూ డదు అంటూ మా వో యిస్టు భావ జాలాన్ని ప్రోత్స హించినట్లు తెలి పింది.

ఈశాన్య రైల్వే
సవరణ
వెబ్‌సైట్: www.ner.indianrailways.gov.in
తేది: 17.06.2026 టెండర్ నెం. 26265061కు తేది: 08.07.2026న గడువు కలిగిన దానికి, మరియు T. ప్రకటన నెం.05, 15.06.2026 (ఐటమ్ నెం. 20), ఐటమ్ నెం.20 ఐటమ్ వివరణ, ప్రకటించబడిన దానికి సవరణ ఇందుమూలముగా క్రింద చేయబడుతోంది. టెండర్ తెరచు తేది: ప్రస్తుతం ఉన్న 08.07.2026 ఎంట్రీ 20.07.2026గా సవరించబడింది. మిగిలిన నియమాలు మరియు నిబంధనలు అన్నీ ఎటువంటి మార్పు లేకుండా ఉంటాయి. గమనిక:- పై సమాచారాన్ని NER వెబ్‌సైట్ www.ner.indianrailways.gov.in మరియు భారత ప్రభుత్వం యొక్క వెబ్‌సైట్ www.tenders.gov.in పై చూడవచ్చును.
CPRO/S - 27 SMM/IC

# సన్న వరి బోనస్ 7 రకాలకే వర్తింపు

## 26 రకాల తొలగింపు

## 100 శాతం ఇస్తే రూ.439 కోట్ల భారం

## ప్రత్యేక రకాల విత్తనాల జాబితా విడుదల

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** ఎన్నికల హామీ మేరకు సన్న వడ్లకు ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్‌ను ఇకపై అధికారికంగా గుర్తించిన కేవలం ఏడు రకాల సన్న వడ్లకు మాత్రమే పరిమితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న 33 రకాల నుంచి 26 రకాలను తొలగించి, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న 7 రకాలను మాత్రమే ఎంపిక చేసింది. ఈ ఏడు రకాల సన్న వరి విత్తనాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఇచ్చే సబ్సిడీపై వ్యవసాయ శాఖ మూడు రకాల ఆర్థిక ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించింది.


రైతులకు 100 శాతం సబ్సిడీ ఇస్తే ప్రభుత్వంపై రూ.439.20 కోట్ల భారం పడుతుంది. ఒకవేళ 50 శాతం సబ్సిడీ ఇస్తే రూ.219.60 కోట్లు, 25 శాతం సబ్సిడీ కేటాయిస్తే రూ.109.80 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా వేసింది. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది.

ఇక మార్కెట్ అవసరాలు, దేశ విదేశాల్లో ఉన్న డిమాండ్‌ను వ్యవసాయ శాఖ శాస్త్రీయంగా విశ్లేషించి ప్రభుత్వం నిర్ణయించిన ఏడు ప్రత్యేక రకాల విత్తనాల జాబితాను గురువారం విడుదల చేసింది. డిమాండ్ లేని రకాలను సాగు చేసి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బోనస్ చెల్లింపునకు అర్హమైనవిగా గుర్తించిన ఏడు రకాల వరి వంగడాల్లో బీపీటీ5204 (సాంబమసూరి), ఆర్ఎన్ఆర్15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్44 (సిద్ది), కేఎన్ఎం 7715 ఉన్నాయి. ఈ నిర్ణీత రకాలను పండించే రైతులకే క్వింటాళ్లకు రూ.500 అదనపు ప్రోత్సాహకం లభించనుంది. మిగిలిన 26 రకాల వడ్ల పరిమాణం ఎక్కువగా ఉండడం, మిల్లింగ్ చేసినప్పుడు నూక శాతం అధికంగా రావడం వల్ల ఎగుమతులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. వినియోగదారులు కూడా వీటిని కొనేందుకు ఆసక్తి చూపడం లేదు.

## విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

# వైటిపిఎస్‌లో ప్రైవేట్‌కు అప్పగించే నిర్వహణ టెండర్‌ను రద్దుచేయాలి

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (వైహెచ్‌పి) ,కోల్ హ్యాండ్లిం గ్ ప్లాంట్ (సిహెచ్‌పి) నిర్వహణ కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు అప్ప చెప్పడానికి జారీ చేసిన టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం టిజి జెన్కో డైరెక్టర్ హెచ్ ఆర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం వైటీపీఎస్ స్టేజ్1లోని యూనిట్1, 2, స్టేజ్2లోని యూనిట్3, 4లు అతి తక్కువ మందితో నిర్వహించబడుతున్నాయని, యూనిట్5 కూడా 2026 సెప్టెంబర్‌లో కమర్షియల్ ఆపరేషన్‌కు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఇలాంటి కీలక విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల సురక్షి త, సమర్థవంతమైన నిర్వ హణకు తగినంత సిబ్బంది అవసరమని ప్రస్తుతం ఉన్న సిబ్బంది కొరత కారణంగా ఉద్యోగులపై అధిక పనిభారం పడుతోందని, ఇది విద్యుత్ కేంద్రాల పనితీరు, పరికరాల ఆరోగ్యం, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ పనులపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల జారీ చేసిన టెండర్ ద్వారా


టిజిజెన్కో డైరెక్టర్ హెచ్‌ఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెఎసి నేతలు సాయిబాబు, రత్నాకర్‌రావు, శ్రీధర్, వజీర్, సదానందం, ఈశ్వర్‌గౌడ్ తదితరులు

వైటీపీఎస్‌లోని మొత్తం ఏహెచ్‌పీ, సీఎచ్‌పీ నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రతిపాదనపై టీజీపీఈజేఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టీజెన్‌కో ఆవిర్భావం నుంచి కొత్తగా ప్రారంభమైన యూనిట్ల నిర్వహణ పనులు ఎల్లప్పుడూ టీజెన్‌కో ఇంజనీర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో పరిమిత కాలఒప్పందాల ద్వారా నిర్వహించబడుతున్నాయని గుర్తు చేసింది. కీలకమైన ఆపరేషన్ మెయింటెనెన్స్ కార్యకలాపాలను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సంస్థలో ఇప్పటివరకు అమలులో ఉన్న విధానాలకు విరుద్ధమని జేఏసీ పేర్కొంది. ఇప్పటికే ఉన్న టీజెన్‌కో సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించకుండా ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్ల సంస్థపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొంది. అందువల్ల వైటీపీఎస్‌లో ఏహెచ్‌పీ మరియు సీఎచ్‌పీ నిర్వహణ కార్యకలాపాల ప్రైవేట్ సంస్థలకు టెండర్‌ను వెంటనే రద్దు చేసి, సంస్థ ప్రయోజనాలు, ఉద్యోగుల సంక్షేమం, విద్యుత్ ఉత్పత్తి భద్రతను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ జి. సాయిబాబు, కన్వీనర్ పి. రత్నాకర్ రావు, జనరల్ సెక్రెటరీ ఈ. శ్రీధర్, తాజుద్దీన్ బాబా, పవన్, వజీర్, సదానందం, కుమారస్వామి, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, రాంజీ, ఈశ్వర్ గౌడ్, సత్యనారాయణ, మోజెస్, నెహ్రు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం
ఫారం-C
ప్రకటన
గెజిట్ నెం. 101 తేది: 15.06.2026
కలెక్టరు కార్యాలయం ఫైల్ నెం: G2/148/2026 తేది:15.06.2026
RDO కార్యాలయం ఫైల్ నెం: F/187/2026 తేది:16.05.2026
DIPR RO.NO: 318/LA/PP/Advt/Pub/2026-27

# ఉపాధి హామీ నిర్వీర్య కుట్రలను కేంద్రం విరమించుకోవాలి

## కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తా: మంత్రి సీతక్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. గురువారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2005లో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిందని, అలాంటి చట్టానికి తూట్లు పొడిచే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. వంద రోజుల ఉపాధి హక్కును కల్పించే చట్టాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు, పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి దాని ఆత్మను, స్ఫూర్తిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వీబీజీరాంజీ పేరుతో కేంద్రం తీసుకువస్తున్న కొత్త విధానం పేదల ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమే కాకుండా, రాష్ట్రాలపై అదనపు ఆర్థిక, పరిపాలనా భారం మోపే ప్రమాదం ఉందన్నారు. ఈ నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీలో ఇప్పటికే తీర్మానం చేసినప్పటికీ, జూలై 1 నుంచి అమలు చేయాలని కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు. ఈ అంశంపై సమగ్రంగా అధ్యయనం చేసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని సీతక్క తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి, తాను సభ్యులుగా ఉన్న ఈ కమిటీ వివిధ రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, చర్చలు జరిపి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్రాలపై అదనపు భారం మోపకుండా, కూలీల హక్కులకు భంగం కలగకుండా ఏ మార్పులు తీసుకురావాలన్న దానిపై కేంద్రం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య తగ్గేలా పలు సాంకేతిక అవరోధాలు సృష్టిస్తున్నారని, రోజుకు రెండు సార్లు ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోలు క్యాప్చర్ చేయాలనే నిబంధన వల్ల జిల్లాల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని, ప్రతి రోజు సమీక్షలు నిర్వహిస్తూ గ్రామీణ కూలీలకు మరింత ఉపాధి కల్పించే చర్యలు చేపడుతోందన్నారు. గత ఏడాది మొత్తం 7.5 కోట్ల పనిదినాలు కల్పించగా, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు అదే స్థాయిలో 7.5 కోట్ల పనిదినాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. గ్రామీణ పేదల జీవనోపాధికి ఆధారమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కేంద్రం వెంటనే విరమించుకోవాలని సీతక్క డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాస్తామని, ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం వీబీజీరాంజీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం తుదినిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**జార్ఖండ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రికి మంత్రి సీతక్క ఫోన్**

కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రతిపాదిస్తున్న వీబీజీ రామ్‌జీ పథకం నేపథ్యంలో తలెత్తుతున్న అంశాలపై తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జార్ఖండ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దీపికా పాండే సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వీబీజీ రామ్‌జీ పథకం అమలుతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, కార్మికులు, ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ పథకం వల్ల నష్టపోయే అవకాశం ఉన్న వర్గాల ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

పథకంలోని పలు నిబంధనలపై రాష్ట్రాలకు ఉన్న అభ్యంతరాలను సమగ్రంగా సేకరించి కేంద్రానికి తెలియజేయాలని నిర్ణయించారు. గ్రామీణ పేదల ప్రయోజనాలకు భంగం కలగకుండా తగిన మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, ఈ అంశంపై దేశంలోని ఇతర రాష్ట్రాలతోనూ చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పథకాన్ని అమలు చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. గ్రామీణ పేదల హక్కులు, ఉపాధి అవకాశాల పరిరక్షణ కోసం అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి ఉమ్మడిగా నిరసన తెలియజేయాలని కూడా ఇరువురు మంత్రులు నిర్ణయించారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

### సంస్థ ఎండిని ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఈ నెల 21న ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ కోర్సులో అడ్మిషన్ల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)- 2026 రీఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందించనున్నారు. నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 21న నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, నీట్ రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష అనంతరం కూడా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను కండక్టర్లకు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో నీట్ పరీక్షకు సుమారు 40వేల మంది హాజరయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

### 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజినీ రింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌ను నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించ నున్నారు. ఈ నెల 22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభిస్తారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ప్రకటించారు. నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి జూలై 1 వరకు విద్యార్థులు వెబ్‌ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. జులై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేస్తారు. జూలై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. జూలై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా ఆయా హెల్ప్‌లైన్ సెంటర్లకి వెళ్లి సందేహాలను నివృత్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం స్పష్టత ఇచ్చాకే కౌన్సెలింగ్‌లు నిర్వహించాలి

### బిసి జెఏసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల ఫీజుల రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిన తర్వాతనే కౌన్సిలింగ్‌లు నిర్వహించాలని, బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఫీజుల రీయింబర్స్ మెంట్‌పై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం కౌన్సిలింగ్‌లు చేపట్టొద్ద న్నారు. ప్రభుత్వం బీసీలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాత పద్ధతి ప్రకారమే ఫీజుల రీయింబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నేడు(శుక్రవారం) హైదరాబాద్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించ నున్నట్టు బీసీ జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత లేకుండానే ఈనెల 27వ తేదీ నుండి కౌన్సిలింగ్‌లు చేపడుతుందని, పాత పద్ధతి ప్రకారమే ఫీజుల రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేస్తామని ప్రకటించిన తర్వాతనే కౌన్సెలింగ్‌లు చేపట్టాలని శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాత పద్ధతిలో పథకం అమలు చేస్తామని ప్రకటించిన తర్వాతే కౌన్సిలింగ్‌లు చేపట్టాలని, లేనిపక్షంలో కౌన్సెలింగ్‌లను అడ్డుకుంటామని జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

# 86 డైట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

### 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్ జూన్ 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) మరో నోటిఫికేషన్‌ను జారీ చేసింది. పాఠశాల విద్యలో డైట్ లెక్చరర్లు, సీనియర్ డైట్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్‌సీ గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మొత్తం 86 పోస్టుల డైట్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్‌సీ నోటిఫికేషన్ నంబర్ 04/జి/ఎస్ఈ/2026ను జారీ చేసింది. వాటిల్లో సీనియర్ డైట్ లెక్చరర్ పోస్టులు 23 ఉండగా, డైట్ లెక్చరర్ పోస్టులు 63 ఉన్నాయి. డైట్ లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించ నున్నారు. జూలై 29 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు కమిషన్ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఈ పోస్టులకు వయో పరిమి తిని 18 సంవత్సరాల నుంచి 44 సంవత్సరాలుగా ప్రకటించింది.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# మేడ్చల్‌లో ఘోరప్రమాదం

### కొండగట్టు దర్శనానికి వెళ్లొస్తుండగా మురహరిపల్లి వద్ద లారీ, కారు ఢీ

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**మేడ్చల్, జూన్ 18, ప్రభాతవార్త:** కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని ఆనందంగా ఇంటిబాట పట్టిన ఓ కుటుంబాన్ని విధి కబళిం చింది. తిరుగుప్రయాణంలో మేడ్చల్ సమీపంలో మురహరిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో కుమారుడు ప్రాణాలతో పోరాడుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన రాజశేఖర్ అక్క జయ, ఆమె పిల్లలతో కలిసి బుధవారం రాత్రి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. అదే సమయంలో ఆయన బావ చంద్రశేఖర్, అక్క రేఖ, వారి ఇద్దరు కుమారులు లోహిత్, నిహాల్ మరో కారులో ప్రయాణిస్తున్నారు. కుటుంబసభ్యులంతా కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. అయితే అర్ధరాత్రి దాటాక మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై మురహరిపల్లి గ్రామం సమీపానికి చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న భారీ లారీ ఒక్కసారిగా కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో కారులో ఉన్నవారు ఇనుప ముక్కల మధ్య ఇరుక్కుపోయారు. స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. తీవ్ర గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చందశేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ ఆయన భార్య రేఖ, చిన్న కుమారుడు నిహాల్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో చందశేఖర్ పెద్ద కుమారుడు లోహిత్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# ఖజానాకు ఆర్థిక పునర్వ్యవస్థీకరణ

### రూ.25 వేల కోట్ల రుణాల మార్పిడి

### పాత అప్పులు స్వల్ప వడ్డీకి దీర్ఘకాలికంగా మార్పు

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** ఇప్పటికే భారంగా ఉన్న రుణాల చెల్లింపుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారించింది. రుణాల మార్పిడి ప్రక్రియ ద్వారా ఈ భారాన్ని తగ్గించుకోవాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర సర్కార్ ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వం చేసిన ప్రయత్నాల నేపథ్యంలో రూ.25 వేల కోట్ల విలువైన అధిక వడ్డీ రుణాలను గణనీయంగా తగ్గించిన పునర్వ్యవస్థీకరించడానికి ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్‌కు ప్రతిపాదనలు పంపించింది. ఫలితంగా పాత స్వల్పకాలిక అప్పులను స్వల్ప వడ్డీకి, ఎక్కువ వాయిదాలు, తక్కువ ఇఎమ్ఐలు చెల్లించేలా దీర్ఘ కాలిక రుణాలుగా మార్చే ప్రక్రియ జరగనుంది.

వీటి స్థానంలో 13 నుండి 28 సంవత్సరాల వరకు తిరిగి చెల్లించే కాలపరిమితి గల తక్కువ వ్యయంతో కూడిన, దీర్ఘకాలిక బాండ్లను ప్రవేశపెట్టనున్నడంతో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో తక్షణ నగదు రుణాల వసూళ్ల ఒత్తిళ్లను తగ్గించనున్నారు. ఇదే విధంగా ఆర్థిక శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.26,103 కోట్ల విలువైన అప్పుల పునర్వ్యవస్థీకరణలో పురోగతి సాధించి, వడ్డీ భారం తగ్గడానికి దోహదపడింది. తాజాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.25 వేల కోట్ల రుణాలను మార్చుకోవడానికి ప్రభుత్వం అనుమతి కోరిందని ఆర్థిక శాఖ అధికారిక వర్గాలు వెల్లడించాయి. వడ్డీలో 3 నుంచి 3.5 శాతం పాయింట్ల తగ్గింపు వల్ల రుణ సేవల్లో ఏటా సుమారు రూ.1,000 కోట్ల ఆదా అవుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. ఆర్థిక పరిస్థితి తీవ్రతను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడిస్తూ రూ.2 లక్షల కోట్ల రుణాలను దశలవారీగా పునర్వ్యవస్థీకరించి, మరింత మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఆర్థిక శాఖ అధికారవర్గాల ద్వారా వెల్లడైంది.



# గవర్నర్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను గురువారం లోక్‌భవన్‌లో పలువురు ప్రముఖులు కలిశారు. మేఘాలయ హైకోర్టు అడ్వకేట్ జనరల్ అమిత్ కుమార్, చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), గండిపేట అధ్యక్షుడు ఎన్. సుభాష్, దివ్య ప్రేమ సేవా మిషన్, హైదరాబాద్ సంయుక్త ప్రతినిధి మంకెన శ్రీనివాస్ రెడ్డి, అఖిల భారతీయ ఇతిహాస సంకలన యోజన, న్యూఢిల్లీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఈశ్వర్‌శరణ్ విశ్వకర్మ గవర్నర్‌ను కలిశారు.

# బిజెపి ఓట్ల చోరీ, సీట్ చోరీని ప్రజలు అడ్డుకోవాలి

### ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ డా.బెల్లయ్య నాయక్ తేజావత్




**హైదరబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** భారతదేశంలో ప్రమాదంలో పడిన ఎన్నికల విధానాన్ని పారదర్శకంగా జరిగేలా, బిజెపి ఓట్లచోరీ, సీట్ల చోరీని ప్రజలు అడ్డుకొంటేనే ప్రజాస్వామ్యం నాలుగు కాలాలు ఫరిడ విల్లుతుందని లేదంటే మళ్లీ నియంతృత్వ నాయులు, కార్పొరేట్ శక్తుల చేతుల్లో ప్రజల భవిష్యత్ బందీ అవుతుందని ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్యనాయక్ తేజావత్ హెచ్చరించారు. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు గురువారం దేశవ్యాప్తంగా జరుగుతున్న సంద ర్భంగా గురువారం మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ గాంధీభవన్‌లో చరఖా సత్యాగ్రహదీక్షను బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టారు. బెల్లయ్య నాయక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్‌కు ఏ సంబంధంలేని ఒక కేసులో ఆమెకు కోర్టునుంచి నోటీసులు వచ్చాయనీ అది కూడా రెండేళ్ళు, అంతకంటే ఎక్కువ జైలు శిక్షపడే ఫిర్యాదు కాదని అలాంటి కేసుపై వచ్చిన అభ్యంతరాన్ని ఎన్నికల కమీషన్ తోసిపుచ్చాల్సి ఉన్నప్పటికీ బిజెపి జేబుసంస్థగా మారి ఒక అభ్యర్థి పోటీచేసే అవకాశం కోల్పోయేలా చేసిందని ఆరోపించారు. తెలంగాణలో మీనాక్షిపై ఫిర్యాదు మాత్రమే ఉందని దానికి ఎఫ్ఐఆర్ కాలేదని ఆయన వివరించారు. ఆ పిటిషన్లు కూడా వారం రోజుల క్రితం కోర్టు తోసిపుచ్చినదని ఆయన గుర్తుచేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కనీస అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి రాజ్యసభ సభ్యురాలుగా మీనాక్షి నటరాజన్ గెలవకుండా నామినేషన్ దశలో తిరస్కరణకు కుట్ర చేశారని ఆరోపించే తీరు చూస్తే హాస్యాస్పదం అనిపిస్తున్నదని ఆవేదన చెందారు. ఆదివాసీలు ఇతర కాంగ్రెస్ నేతలు ఈ నిరసనలోపెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కోచ్‌లతో వరంగల్ స్టాలియన్స్ అండర్ 15 బాలికల జట్టు

# హైదరాబాద్‌లో బాస్కెట్‌బాల్ (టిజెబిఎల్) ప్రీమియర్ లీగ్ ఫీవర్

### 1.48 కోట్లతో జట్ల(ఫ్రాంచైజీ)ను కొనుగోలు చేసిన కార్పొరేటర్ సంస్థలు

### నేటి నుంచి కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో పోటీలు

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో బాస్కెట్‌బాల్ ఫీవర్ నెలకుని ఉంది. తెలంగాణ జూనియర్ బాస్కెట్‌బాల్ ప్రీమియర్ లీగ్ (టిజెబిఎల్)కు నగరం ముస్తాబైంది. ఈ నెల 19 నుంచి 28 వరకు యూసఫ్ గుడాలోని కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయి. ఐపిఎల్ తరహాలో 1.48 కోట్లుతో 12 టీములను కార్పొరేటర్ సంస్థలకు చెందిన ఫ్రాంచైజీలు కొనుగోలు చేయడం విశేషం. అండర్ 15, 18 కేటగిరిలో బాలురు, బాలికలకు చెందిన 12 జట్లు లీగ్‌లో పాల్గొంటాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి ఉత్తమైన 288 మంది యువ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఫ్రాంచై జీలు క్రీడాకారులను ఓపెన్ ఆక్షన్‌లో కొనుగోలు చేశారు. హైదరాబాద్ హరికేన్ జట్టును ప్రెస్ప్రో గ్రూపు 33 లక్షలకు, వికారాబాద్ ప్రెడెట్టర్స్‌ను చరితారెడ్డి గ్రూపు 21.50 లక్షలు, మెదక్ మోన్‌స్టర్స్‌ను శ్రీనివాస్‌వర్మ గ్రూపు 21.50 లక్షలు, వరంగల్ స్టాలియన్స్‌ను బసాని గ్రూపు 22.50 లక్షలు, నల్గొండ నింజాస్ 19.50 లక్షలు, రంగారెడ్డి రూలర్స్ 30.50 లక్షలకు రాప్టర్ గ్రూపు దక్కించుకుంది. ఆయా ఫ్రాంచైజీలు విలువ 1.48 కోట్లుగా ఉంది. ఫ్రాంచైజీలకు ఒక్కో టీము కు నగరంలోని పలు కంపెనీలు స్పాన్సర్‌షిప్ చేస్తున్నాయి. యువ క్రీడాకారులు తమ ప్రతిభను కనపరచడానికి మంచి అవకాశం లీగ్ ద్వారా ఉంటుందని తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పృథ్వీరెడ్డి పేర్కొన్నారు. లీగ్‌లో ఉత్తమ ప్రదర్శన చేసే క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ వేదికలతో పాటుగా జూనియర్ ఎన్‌బిఎలో అవకాశాలు ఉంటాయని తెలిపారు.

# రాష్ట్రానికి 40వేల మె.ట. యూరియా కోత విధించిన కేంద్రం

### రామగుండం యూరియా తెలంగాణలో వినియోగించాలి

### ప్రభుత్వ విప్ విజయరమణారావు

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి ఏప్రిల్, మే నెలల్లో కేటాయించాల్సిన కోటాలో కేంద్రప్రభుత్వం 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా కోత పెట్టారని, లక్షా యాభై మూడు మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారని ప్రభుత్వ విప్ విజయరమణారావు ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ రామగుండంలో ఉత్పత్తి అయ్యే యూరియాను మొత్తం ఇక్కడే ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌కు రామగుండం నుంచి యూరియా సరఫరా చేస్తూ ఇక్కడి రైతును అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు రైతులపైన ఏమాత్రం ప్రేమ ఉన్నా ప్రధాని మోడీతో మాట్లాడి రామగుండం యూరియాను తెలంగాణకు కేటాయించేలా చూడాలని కోరారు. యూరియా సరిపోయినంత అందుబాటులో ఉంటే నాట్లు ప్రారంభం అవుతాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని యూరియా కోసం మా ప్రజా ప్రతినిధులందరి కలుస్తామనీ, కేంద్రం కొనుగోలు చేయకపోతే అవసరమైతే వడ్లను బిజెపి నాయకుల ఇళ్ల ముందు పోస్తామని హెచ్చరించారు. వరి వేయవద్దని ప్రభుత్వం చెప్పడం లేదనీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల్ని వేయాలని మాత్రమే చెబుతోందన్నారు. విదేశాలకు ఎగుమతి కి అనుకూలంగా బిపిటి..5204( సాంబమసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కెఎన్ ఎం 1638 (కునారం సన్నలు), డబ్ల్యూ జిఎల్ 44 (సిద్ధి), కెఎన్ ఎం 7715 ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను రైతులు వేసుకోవాలనీ ఆయన సూచించారు. 19 నుంచి వర్షాలు రాబోతున్నాయని వాతా వరణ శాఖ ప్రకటించిందనీ ఎమ్మెల్యే తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఏనాడు రైతులకు బోనస్ ఇవ్వలేదనీ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు చెల్లించిందనీ రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనీ ఆయన వివరించారు. పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు రైతు మద్దతు ధర గురించి ఆలోచించలేదు సరికదా సిఎం రేవంత్‌రెడ్డి మడమ తిప్పకుండా బోనస్ ఇస్తున్నాడని అన్నారు. బిజెపి రైతు గోస అంటూ ఎందుకు తిరిగారో అర్థం కాలేదు రైతుల పైన మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదనీ చెప్పారు.

# తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### ధర్నాలో పలువురు వక్తల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యే కంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఉద్యమకారుల మహాగర్జన పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ మహాగర్జన కార్యక్రమంకు బీసీ సంక్షేమసంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర ఛైర్మన్ నరాల సత్యనారాయణ హాజరై ప్రసంగించారు.

జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంకు బడా కాంట్రాక్టర్ల మీద ఉన్న శ్రద్ధ తెలంగాణ ఉద్యమకారులపై లేకపోవటం విచారకరమన్నారు. ప్రజలకు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలుచేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

మోతె శోభన్‌రెడ్డి మాట్లా డుతూ తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, కమిటీ నివేదిక ఆధారంగా ఉద్యమ కారులకు న్యాయం చేసేం దుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. నిజమైన ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. నరాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలంతో పాటు భారత స్వాతంత్ర్య సమాన్ ఏ వన్ గ్రేడ్ క్రింద 50వేల పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక కోటా కల్పించాలని, ఉద్యమకారుల సంక్షేమానికి పదివేల కోట్ల రూపాయలు కేటాయించాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల వేడుకలకు ఉద్యమకారులను ప్రత్యేకంగా ఆహ్వానించి, గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి, ఉద్యమకారులకు న్యాయం చేయాలని, లేనిపక్షం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులందరినీ కలుపుకుని, పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక నాయకులు

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, ఉద్యమకారుల వేదిక వైస్ ఛైర్మన్ టి.శంకర్‌గౌడ్ మరియు ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం
**గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ**
ప్రాంతీయ సమన్వయాధికారి గిరిజన సంక్షేమ విద్యాలయాల సంస్థ (గురుకులం) కరీంనగర్ మరియు వరంగల్
**టెండర్ ప్రకటన**

RC.No. A2/01/2026, తేది: 18.06.2026

2026-27 విద్యా సంవత్సరమునకు ఐ.టి.డి.ఏ. ఏటూరునాగారం (హన్మకొండ, వరంగల్ మరియు జనగాం జిల్లా) పరిధిలోని గిరిజన గురుకుల విద్యాలయాలకు ఆహారపదార్థములు (పండ్లు, కూరగాయలు, చికెన్ (స్కిన్ లెస్) మరియు మటన్) సరఫరా చేయుటకు, కేటరింగ్, స్వీపింగ్ మరియు శానిటేషన్ మొదలగునవి సరఫరా చేయుటకు గాను ఆసక్తి గల సంస్థల (FIRMS) నుండి సీల్డు టెండర్లు కోరడమైనది.
**విద్యాలయాల వివరములు (09):-** 1. TGTWURJC (G), హన్మకొండ, 2. COE, వరంగల్ 3. TGTWRCOE, యాకుబ్‌పుర, 4. TGTWURJC (G), పర్వతగిరి, 5. TGTWURJC (B) నర్సంపేట్, 6. TGTWURJC (G), MC పల్లి, 7. సైనిక్ స్కూల్, అశోక్‌నగర్, 8. TGTWURJC (G), పాలకుర్తి 9. TGTWRDC (W), జనగాం.
**క్ర.సం., టెండర్ పేరు సరఫరా వివరములు, ధరావత్ సొమ్ము రూపాయలలో: యస్.సి, యస్.టిలకు, ఇతరులకు:** 1) కూరగాయలు: 36,000.00, 60,000.00. 2) పండ్లు: 42,000.00, 70,000.00. 3) చికెన్ (స్కిన్ లెస్) మరియు మటన్: 42,000.00, 70,000.00. 4) కేటరింగ్: 60,000.00, 1,00,000.00. 5) స్వీపింగ్ మరియు శానిటేషన్: 24,000.00, 40,000.00.
టెండరు నియమ నిబంధనలు మరియు వివరములు టెండర్ ఫారములో పొందుపరచబడినది.
పైన పేర్కొన్న ప్రతి టెండర్ అంశానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన టెండర్ దరఖాస్తులను పొందుటకు రుసుము రూ.2000.00 (అక్షరాల రెండు వేల రూపాయలు మాత్రమే)ల డిమాండ్ డ్రాఫ్టును (SBIలో) Regional Coordinator, TTWREIS, కరీంనగర్ మరియు వరంగల్ పేరున తీసి అట్టి డిమాండ్ డ్రాఫ్టును Regional Coordinator, TGTWREIS, గురుకులం, వరంగల్ మరియు కరీంనగర్, PO క్యాంప్ ఆఫీస్, అంబేద్కర్ భవన్ ఎదురుగా, హన్మకొండ, వరంగల్ వారి కార్యాలయము నందు అందచేయవలెను.
**టెండర్ నోటిఫికేషన్-షెడ్యూలు: క్రమ సంఖ్య, విషయము, తేది:** 1) టెండర్ నోటిఫికేషన్ తేది: 19.06.2026. 2) టెండర్ దరఖాస్తు పొందుటకు చివరి తేది: ప్రచురణ తేది 19.06.2026 నుండి 30.06.2026 సా.4.00 గం. వరకు. 3) టెండర్ దాఖలు చేయుటకు చివరి తేది: 30.06.2026 సా.5.00 గం. వరకు. 4) టెండర్ దరఖాస్తులను తెరువబడు తేది: 01.07.2026 ఉ.11.00 గం.లకు ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం, హన్మకొండ జిల్లా యందు.
గమనిక: పైన పేర్కొన్న తేదీలు, టెండర్ విధి విధానములు, షరతులు అన్ని విషయాలలో మార్పులు చేయు అధికారము మరియు పూర్తిగా రద్దు పరిచి తదుపరి నిర్ణయం తీసుకొనే అధికారం ప్రాజెక్ట్ అధికారి/ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, ఐ.టి.డి.ఏ., ఏటూరునాగారం గారికి కలదు. ఈ విషయాలలో ఎటువంటి వాదోపవాదాలకు తావులేదు.
సం/- ప్రాంతీయ సమన్వయాధికారి, గురుకులం, కరీంనగర్ మరియు వరంగల్
సం/- ప్రాజెక్ట్ అధికారి/ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, ఐ.టి.డి.ఏ., ఏటూరునాగారం
DIPR.No.4476-PP/CL/Advt/1/2026-27, తేది: 18.06.2026



## ఓటర్ల జాబితా ప్రక్షాళనలో మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలి

### మైనార్టీ సంక్షేమ మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక ప్రక్షాళన ప్రక్రియ జరుగుతున్న వేళ మైనారిటీలు, అర్హులైన ఓటర్లు జాగ్రత్తగా ఉండాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ గతంలో బీహార్, బెంగాల్‌లలో మైనారిటీ ఓట్లు గల్లంతయ్యాయని అన్నారు. ఇక్కడ అలాంటివి జరగకుండా చూస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోందని తెలిపారు. ప్రతిపక్ష నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే ఈనెల 25 నుండి రాష్ట్రంలో సర్ ప్రక్రియ జరగనుంది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 25న ప్రక్రియ ప్రారంభించి అక్టోబర్ 1 నాటికి తుది ఓటర్ల జాబితా ముగుస్తుంది. ఇందులో భాగంగా ఈనెల 24 నుండి జూలై 25 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి కనీసం మూడు సార్లు స్వయంగా వచ్చి ఓటర్ వివరాల ఫారాలను పంపిణీ చేస్తారు. వాటి ద్వారా పూర్తి వివరాలను సేకరిస్తారు. ఈ నేపధ్యంలో మైనార్టీలు, అర్హులైన ఓటర్లు అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు.

## ఫోన్‌ట్యాపింగ్ కేసులో చికోటి ప్రవీణ్‌ను విచారణకు పిలిచిన సిట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో చికోటి ప్రవీణ్‌ను శుక్రవారం విచారణకు రావాలని సిట్ అధికారులు సమన్లు జారీచేశారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎస్ కార్యాలయానికి రావాలని సూచించారు. గతంలో తన ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు డీజీపీ చికోటి ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తన ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రవీణ్ ఫిర్యాదు చేశారు.

## జనసేన పార్టీ తెలంగాణ కార్యాలయం నేడు ప్రారంభించనున్న పవన్‌కల్యాణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్18:** నగరంలో జనసేన తెలంగాణ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటలకు మణికొండ చెరువు సమీపంలోని పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ఈ నూతన కార్యాలయంతో తెలంగాణలో పార్టీ విస్తరణకు పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే రాష్ట్రంలోని జనసైనికులు, వీరమహిళలు, నాయకులకు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది.

## నేడు మంచిర్యాలలో బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పర్యటన

### అక్రమార్కుల నుంచి సింగరేణిని కాపాడుకుందామని ధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్18:** సిరుల గన్నిగా వెలుగొందిన సింగరేణి సంస్థను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్‌ల ఖనిగా మార్చివేసిందని బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ ఆరోపించింది. గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, రెండున్నరేళ్లు దాటినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అదే అవినీతి బాటలో నడుస్తూ సంస్థను దోచుకుంటోందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్ ఆరోపించారు. సింగరేణిలో సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమవ్వడం, ఓబీ టెండర్లలో పారదర్శకత లేకపోవడం, ఎక్సెస్ టెండర్ల వల్ల సంస్థకు భారీ నష్టం వాటిల్లడం, అడ్రియాల ప్రాజెక్టు నష్టాలు మరియు సోలార్, విద్యుత్ ప్రాజెక్టులలో జరిగిన ఆర్థిక అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్18:** జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల వంతెన సమీపంలోని జాతీయ రహదారిపై టైరు మారుస్తున్న గూడ్స్ వాహనాన్ని గురువారం వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి దేవరుప్పుల గ్రామానికి కిరాణా సరుకులతో వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనాన్ని వరంగల్ వైపు వెళ్తున్న ఓ లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను దేవరుప్పుల గ్రామానికి చెందిన ఝూటే రోహిత్ (22), దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంకు చెందిన దోనికేని రాజేందర్ (27), గుండాల మండలం బండకొత్తపల్లికి చెందిన అశోక్ లేలాండ్ డ్రైవర్ నానుబాల మహేష్ (22)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

## దంపతుల దారుణ హత్య?

### పీరిల ఉదంతమే ప్రాణం తీసిందా..

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :** ఆసిఫాబాద్ మండలంలోని కోసరా గ్రామ పంచాయతీలో గల భవాని నగర్ తాండలో భార్యభర్తల హత్య బుధవారం రాత్రి సంఘటన చోటుచేసుకున్నట్లు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేర్కొనడం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బానోత్ రాజునాయక్ (50), సుశీల (45) బుధవారం రాత్రి ఇంటి ముందట పడుకున్న చోట హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. గతంలో కోసరాలో పీరిల ప్రతిమలు దొంగలించ బడ్డాయి. ఇదే సంఘటన పోలీస్ స్టేషన్‌లో సైతం కేసు నమోదు చేయడం జరిగింది. ఇదిలా ఉంటే గ్రామస్తులు రాజునాయక్ చందాలతో ఈసారి పీరిల ప్రతిమలు చేయించి బుధవారం రోజున కోసరాలోని పీరిల బంగ్లాలో ప్రతిష్టాపించడం జరిగింది. గతంలో పీరిల ప్రతిమలు దొంగిలించిన ఆగంతకులు ఈసారి రాజునాయక్‌కు పీరిల దేవుడు రానుండడంతో ఆగంతకుల వివరాలు వెల్లడిస్తే ఇబ్బంది అవుతుందని భావించి ఈ ఆగంతకానికి పాల్పడినట్లు మృతుల బంధువులు తెలిపారు.



రాజునాయక్, సుశీల (ఫైల్)

పథకం ప్రకారమే భార్య భర్తలను హత్య చేసినట్లు వారు అన్నారు. బుధవారం రాత్రి పీరిల బంగ్లా పూజ అనంతరం రాజునాయక్ ఇంటి వద్ద హాలులో భార్యభర్తలు నిద్రలో ఉపక్రమించడంతో అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి ఈ ఆగంతకానికి పాల్పడినట్లు కుమారులు సైతం ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. ఉదయం ఈ సంఘటన కలకలం రేపింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కొరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. కేసును ఆసిఫాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భారత్‌కు వాతావరణ శాఖ హెచ్చరిక

# అధికారికంగా ఎల్‌నినో ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** భారత వాతావరణ విభాగం (ఐఎండీ) కరవు హెచ్చరిక జారీ చేసింది. భారత్‌లో ఎల్‌నినో అధికారికంగా ప్రారంభమైనట్లు తెలిపింది. భూమధ్య రేఖ పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు గురువారం భారత వాతావరణ శాఖ ధృవీకరించింది. సముద్ర ఉష్ణోగ్రతలు ఎల్‌నినోకు అవసరమైన పరిమితిని దాటినట్లు వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడాన్ని ఎల్‌నినోగా పరిగణిస్తారు. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. అయితే భారత్‌లో రుతుపవనాలను ప్రభావితం చేసే అంశం ఎల్‌నినో ఒక్కటే కాదని, ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో తటస్థ ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) పరిస్థితులు కొనసాగుతున్నాయని ఐఎండీ తెలిపింది. అయినప్పటికీ రాబోయే నెలల్లో వర్షపాతం, వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం ఎలా ఉంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. కాగా సాధారణంగా ఎల్ నినో పరిస్థితులు వస్తున్నాయంటే భారతీయ రైతులకు, వాతావరణ నిపుణులకు చేదు వార్తగా చెప్పవచ్చు. ఎల్ నినో ప్రభావం వల్ల దేశంలో వర్షాలు తగ్గిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం, తీవ్రమైన అనావృష్టి లేదా కరవు పరిస్థితులు ఏర్పడే ముప్పు ఉంటుంది. సముద్రం, వాతావరణం రెండూ కలిసి ఇప్పుడు పూర్తి స్థాయిలో ఎల్ నినో వైపు అడుగులు వేశాయని వాతావరణ శాఖ విశ్లేషించింది. ఎల్ నినో తీవ్రతను కొలిచే కీలకమైన నినో 3.4 ఇండెక్స్ సగటు గడిచిన మూడు నెలల్లో +0.5 డిగ్రీల సెల్సియస్ దాటడంతో దీని రాక అధికారికంగా ఖరారైనట్లు ఐఎండీ వెల్లడించింది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం ఉపరితల ఉష్ణోగ్రతలు ఎల్‌నినో పరిస్థితులకు అవసరమైన పరిమితిని దాటిపోయినట్లు పేర్కొంది. మాన్సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ (ఎంఎంసీఎఫ్‌ఎఫ్) అంచనాల ప్రకారం రుతుపవన కాలం గడుస్తున్న కొద్దీ ఎల్‌నినో తీవ్రతరం అయ్యే అవకాశం ఉంది. మధ్య ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఎల్‌నినో పరిమితిని దాటాయి. నైరుతి రుతుపవనాల కాలంలో ఎక్కువ భాగం మితమైన, బలమైన ఎల్‌నినో పరిస్థితులు ఉంటాయని తాజా అంచనాలు సూచిస్తున్నాయి. కాగా హిందూ మహాసముద్రంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇదే నిజమైతే, పసిఫిక్‌లో మొదలుకొస్తున్న ఈ సూపర్ ఎల్ నినో సృష్టించబోయే విధ్వంసాన్ని, నష్టాన్ని పాజిటివ్ ఐఓడీ కొంతవరకు అడ్డుకుని, భారతదేశానికి రక్షణ కవచంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూలైలో సానుకూల ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని, ఇది దేశంలోని రుతుపవన వర్షపాతంపై సూపర్ ఎల్‌నినో చూపే ప్రతికూల ప్రభావాలను కొంతవరకు తగ్గించడంలో సహాయపడవచ్చని పేర్కొంది. రాబోయే కాలంలో పసిఫిక్, హిందూ మహాసముద్రాలలో మారబోయే ఈ వాతావరణ పరిస్థితులను నిరంతరం నిశితంగా గమనిస్తూ, ప్రతి నెలా అప్‌డేట్స్ ఇస్తామని భారత వాతావరణ శాఖ దేశ ప్రజలకు, రైతులకు భరోసా ఇస్తుంది.



**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యా ర్థం నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు,

## విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటిన్ పరిశీలించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి గురువారం ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఆయన ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎల్‌బిస్టేడియంలో సిఎం చేతుల మీదుగా

# 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 18:** విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం , మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమం లో సిఎం రేవంత్‌రెడ్డి రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు విద్యార్థి హక్కుల కిట్లు(స్టూడెంట్ ఎంటైటిల్‌మెంట్ కిట్స్) పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షే మం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20 రకాల వస్తువులతో కిట్లు అందజేస్తున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలను మాద కద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు, కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం, విద్యాసంస్థల్లో సురక్షి తమైన, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమంలో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ శాఖలు, విద్యా శాఖ సంబంధిత అధికారులకు కార్యక్రమ నిర్వహణకు అవసరమైన బాధ్యతలు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యారంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలవనుంది.

## కారుమూరి సునీల్‌కు 14 రోజుల రిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్18:** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో జరిగిన లిక్కర్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌ను ఈడీ అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఆయన్ను ఈడీ కార్యాలయానికి తరలించారు. సునీల్ అరెస్టుతో ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మద్యం రవాణా టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఈడీ ఆరోపిస్తోంది. సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ వంటి కొన్ని సంస్థలకు అనుకూలంగా టెండర్ నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా మార్చారని, తద్వారా ప్రభుత్వ ఆదాయానికి సుమారు రూ.195 కోట్ల మేర గండికొట్టారని ఈడీ అంచనా వేసింది. సునీల్‌కు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## కెసిఆర్‌తో కెటిఆర్, హరీశ్‌రావు కీలక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్18:** బిఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు గురువారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో సమావేశమయ్యారు, మెట్రో రైలు విస్తరణ,యూరియా కొరత,కరవు పరిస్థితులు,రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలని కెసిఆర్ ఆదేశించారు. ఈ సందర్బంగా జిహెచ్‌ఎంసి ఎన్నికల సన్నాహాలు,బిఆర్ఎస్ పార్టీ సంసిద్దతపైనా కెసిఆర్ సమీక్ష నిర్వహించారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

### ఎస్‌బిఐ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** హైదరా బాద్ పరిధిలోని అత్యంత ఖరీదైన ప్రాంతం రాయదుర్గం పరిధిలోని ఐటీ హబ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనని పేర్కొంటూ ఎస్‌బిఐ యాజమాన్యం పిటీషన్‌లో పేర్కొంది. ఈ మేరకు ఆ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని రాయదుర్గం భూముల వేలంపై 3 వారాల పాటు స్టే విధించింది. ఈ విచారణ సందర్భంగా ఇరుపక్షాల మధ్య వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) ధర్మాసనం ఎదుట తమ వాదనలు వినిపిస్తూ 2010లోనే రాయదుర్గంలోని సదరు భూమికి సంబంధించి అప్పటి టీజీఐఐసీతో ఎస్‌బిఐ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం రెండేళ్ల కాల పరిమితిలోనే అక్కడ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఒప్పందం జరిగి దాదాపు 16 ఏళ్లు గడిచినా ఎస్‌బిఐ అక్కడ ఎలాంటి నిర్మాణ పనులను ప్రారంభించలేదని కోర్టుకు విన్నవించారు. నిబంధనల ఉల్లంఘన వల్లే ఆ భూమిని వేలానికి పెట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఏఏజీ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ ప్రభుత్వ తీరును తప్పుపట్టింది. అసలు ఏ కారణంతో ఆ భూమిని వేలం వేశారు, అది ఎస్‌బిఐకి కేటాయించిన భూమి అని మీకు తెలీదా ఓ ప్రభుత్వ సంస్థ భూమిని ఇలా ఎలా వేలం వేస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఇలా భూములను వేలం వేస్తూ రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని పరుగులు పెట్టించాలనుకున్నారా అంటూ ధర్మాసనం వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలపై ఏఏజీ కలుగజేసుకుంటూ కోర్టుకు వివరణ ఇచ్చారు. ఈ భూమిని వేలం వేయడం ద్వారా వచ్చే నిధులను ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తుందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు రాయదుర్గం వేలంపై 3 వారాల పాటు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఆ మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ఎస్బీఐ, టీజీఐఐసీ తదితర సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది.

# పీస్ డీల్

>> దీనికి ఆమోదం తెలపడంతో ఈ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఈ చారిత్రాత్మక ఒప్పందం అంత సులభంగా సాధ్యపడలేదు. కొన్ని నెలలుగా ఒమన్ తో ఇతర దేశాలు నేతృత్వంలో తెరవెనుక తీవ్రమైన దౌత్య సంప్రదింపులు జరిగాయి. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న తరుణంలో, ఇరు దేశాలు పట్టువిడుపులకు వెళ్లకుండా ఒప్పందానికి ముందుకు వచ్చాయి.

ఒప్పందంలోని కీలక అంశాలు: అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందంలో ఇరు దేశాలు అంతర్జాతీయ శాంతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందానికి అంగీకరించాయి.

లెబనాన్ సరిహద్దులతో సహా పశ్చిమాసియాలోని అన్ని ప్రాంతాలలో ఇరు దేశాలకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష సైనిక చర్యలు, దాడులను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య కూడా ఒక సంధి జరగనుంది.

కొంతకాలంగా ఉద్రిక్తతలకు కేంద్రంగా మారి, అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డుకట్టగా మారిన హార్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. ప్రారంభంలో 60 రోజుల పాటు ఎలాంటి అదనపు రుసుము లేకుండా అంతర్జాతీయ నౌకల సురక్షిత ప్రయాణాన్ని ఇరాన్ కల్పించనుంది. ఇరాన్ ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి ఆ దేశ సరిహద్దుల వద్ద అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఉపసంహరించుకోనుంది.

యుద్ధాలు, ఆంక్షల కారణంగా నష్టపోయిన ఇరాన్‌లో పునర్నిర్మాణ పనులు, ఆర్థిక అభివృద్ధి కోసం అమెరికా మద్దతుతో దాదాపు 300 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీనితో పాటు వివిధ దేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల, ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా ట్రెజరీ మినహాయింపులు ఇవ్వనుంది.

తాము ఎప్పటికీ అణు ఆయుధాలను తయారు చేయబోమని ఇరాన్ ఈ ఒప్పందంలో ప్రపంచ దేశాలకు స్పష్టమైన హామీ ఇచ్చింది. అయితే, ఇరాన్ వద్ద ఇప్పటికే ఉన్న సుసంపన్నమైన యురేనియం నిల్వల భవిష్యత్తును ఎలా నిర్ణయించాలనే దానిపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణలో రాబోయే చర్చల్లో ఒక నిర్ణయానికి రానున్నారు.

**నేడు స్విట్జర్లాండ్‌లో చర్చలు:**

అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా, ఇప్పుడు దాన్ని అమలు చేసేందుకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు తొలి దశ చర్చలు స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు సమావేశం కానున్నట్లు స్విస్ ప్రభుత్వం వెల్లడించింది. అందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. స్విస్ విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికా, ఇరాన్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు కూడా ఆ సమావేశంలో పాల్గొననున్నారు. ఒప్పందం అమలుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై చర్చలు జరగనున్నాయని పేర్కొంది. అయితే సమావేశానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌తోపాటు ఇతర వివరాలు ఇంకా వెల్లడించలేదు.

**60 రోజుల్లో తుది ఒప్పందం:**

ఈ తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని పూర్తి స్థాయి శాశ్వత ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలకు 60 రోజుల గడువును విధించారు. అవసరమైతే ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో ఈ గడువును మరింత పొడిగించుకునే అవకాశం ఉంది. రాబోయే 60 రోజుల్లో సమగ్ర, శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం ఇరు దేశాలు వరుస చర్చలు జరపనున్నాయి. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి కూడా ఈ ఒప్పందం ఖరారైనట్లు ధ్రువీకరించారు. ఒమన్‌తో పాటు ఇతర దేశాల సహకారంతో సంప్రదింపులు జరిపి ఈ అవగాహన ఒప్పందాన్ని తుది రూపం ఇచ్చినట్లు వెల్లడించారు.

**చమురు ధరలపై ప్రభావం:**

అమెరికా– ఇరాన్ మధ్య ఒప్పందం అమల్లోకి రాగానే ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు స్థిరపడటం ప్రారంభమైంది. ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడంతో ఇంధన మార్కెట్లలో స్థిరత్వం ఏర్పడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అమెరికా –ఇరాన్ మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం పశ్చిమాసియా రాజకీయాల్లోనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయ ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సిపిఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

# ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూన్ 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆయన ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ముషీరాబాద్ పాఠశాల నూతన భవనం 2021లో ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు నిర్మాణం పూర్తికాకపోవటం విచారకరమన్నారు. సుమారు 800 మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నప్పటికీ, వారికి సరిపడా గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి, మౌళిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యత ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించినప్పటికీ, నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందటం లేదని ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే యూనిఫామ్‌లు అందచేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందలేదని, అన్ని సబ్జెక్టులకు తగినంత మంది ఉపాధ్యాయులు కూడా లేరని, ఈ సమస్యలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందిస్తారని ప్రశ్నించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టని ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో సమస్యలపై దృష్టి పెట్టి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్‌రెడ్డి, నాగేందర్, రజనీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం పెంచేందుకు క్లైమేట్ స్మార్ట్‌ప్లాన్

### వ్యవసాయ రక్షణకు పంటల మార్పిడి అనివార్యం

### సలహా కమిటీలో నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్

### సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ: వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** రైతుల ఆదాయం పెంచేందుకు క్లైమేట్ స్మార్ట్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. ఎల్‌నినో వాతావరణ మార్పుల దెబ్బకు వ్యవసాయం, రైతాంగానికి అండగా నిలిచేందుకు కీలక వ్యూహాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రాంతీయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన మార్కెట్ కల్పించడం, విలువ ఆధారిత ఉత్పత్తుల సప్లై చైన్‌ను మెరుగుపరచడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మార్చవచ్చన్నారు. వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడేలా నాబార్డ్ తెలంగాణలో ఇప్పటికే పలు ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తోందన్నారు. క్లైమేట్ స్మార్ట్ వరి సాగు కింద రైస్360 పేరుతో 450 ఎకరాల్లో పైలట్ ప్రాజెక్ట్ నడుస్తోందని, జీవా ప్రోగ్రామ్ ద్వారా సేంద్రీయ సాగుకు పూర్తి ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటికే 20 వేలకు పైగా పండ్ల తోటలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు సన్నకారు రైతుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన షేడ్ నెట్ హౌస్‌లు, మైక్రో ఇరిగేషన్, వాటర్ షెడ్ల అభివృద్ధి, ఎఫ్‌పీఓ లకు మద్దతు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతకు ముందు ఈ సమావేశంలో క్లైమేట్ స్మార్ట్ వ్యవసాయం, పంటల మార్పిడి ద్వారా రైతుల ఆదాయాన్ని స్థిరంగా ఉంచే మార్గాలపై నిపుణులు చర్చించారు. ఒకే పంట వేయడం, తీవ్రమవుతున్న నీటి కొరత, వాతావరణంలో ఆకస్మిక మార్పులు, మార్కెట్ అనిశ్చితి ఇవి ఇప్పుడు రైతులను వేధిస్తున్న ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. వీటికి చెక్ పెట్టాలంటే కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య రంగాలను కూడా సమ్మిళితం చేస్తూ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో నిపుణులు అభిప్రాయపడ్డారు.

**సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ ఇవ్వాలి**

ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి పలు కీలక సూచనలు చేశారు. కూరగాయలు పండించే రైతులకు కోతుల బెడద ఎక్కువగా ఉన్నందున, సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీల కొరతను అధిగమించేందుకు కలుపు యంత్రాలు, చిన్న వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇవ్వడంతో పాటు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరా బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. వర్షాధార పంటలైన నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు పెంచితే రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు.

# ఉభయసభల్లో మెజార్టీ దిశగా బిజెపి



న్యూఢిల్లీ,జూన్ 18: లోక్‌సభలో పూర్తి ఆధిపత్యం సాధించాలన్న లక్ష్యంతో ఉన్న ఎన్డీయేకు ప్రతిపక్ష పార్టీల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కలిసి వస్తున్నాయనడానికి వివిధ రాష్ట్రాల్లో కనిపిస్తున్న తిరుగుబాట్లు, పార్టీఫిరాయింపులు, విలీనాల చర్చలు చూస్తే నిజమనే సంకేతాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడొంతుల మెజార్టీ (362 ఎంపిలు) సాధించే దిశగా అధికార కూటమి క్రమంగా ముందుకు వెళ్తోందన్న వర్గాజోరందుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడువంటి కీలక రాష్ట్రాల్లో బిజెపి ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో బిజెపి సొంతంగా 240 స్థానాలకే పరిమితమైంది. ఎన్డీయే బలం 293కు చేరినా, మూడొంతుల మెజార్టీకి అవసరమైన సంఖ్యకు ఇంకా దూరంగానే నిలిచింది. ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాలు వేగంగామారుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు ఎంపీలు పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిలో 20 మంది ఎంపీలు విడిపోయి కొత్త రాజకీయ వేదికలో చేరే అవకాశాలపై చర్చ నడుస్తోంది. ఈ వర్గం ఎన్డీయేకు మద్దతు ఇచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అదే జరిగితే అధికార కూటమి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(యుబిటి)లోనూ సంక్షోభం నెలకొంది. పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని స్పీకర్‌కు లేఖ రాయడం కలకలం రేపింది. దీనిపై స్పందించిన పార్టీ నేత సంజయ్ రౌత్.. ఎంపీలను కొనుగోలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒక్కో ఎంపికి భారీ మొత్తాలు ఆఫర్ చేశారని కూడా వ్యాఖ్యానించారు. ఈ తిరుగుబాటు నేతలు ఎన్డీయేకు దగ్గరవుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీలో చీలిక వస్తుందంటూ ప్రచారం సాగుతోంది. రాష్ట్ర మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు దీనికి మరింత ఊతమిచ్చాయి. అయితే ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఈ ప్రచారాన్ని ఖండించారు. పార్టీ ఐక్యంగానే ఉందని స్పష్టం చేశారు. తమిళనాడులో డిఎంకేకాంగ్రెస్ సంబంధాల్లో దూరం పెరుగుతోందన్న వార్తలు కూడా రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఈ పరిస్థితిని బిజెపి అవకాశంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై డిఎంకె అధికారికంగా స్పందించ లేదు. లోక్‌సభతో పాటు రాజ్యసభలోనూ ఎన్డీయే బలం పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా ఎన్నికల తర్వాత అధికార కూటమి సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా. బెంగాల్‌లో ఖాళీ అయిన కొన్ని స్థానాలకూడా బిజెపి ఖాతాలో పడే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రస్తుత ఇవన్నీ రాజకీయ చర్చల దశలోనే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీల్లో అసంతృప్తి, తిరుగుబాట్లు నిజంగా ఎన్డీయేకు సంఖ్యాబలం పెంచుతాయా లేక అవి కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోతాయా అన్నది రానున్న రోజుల్లో స్పష్టత వస్తుందని నిపుణుల అంచనా.




## భారత్‌కు చేరువవుతున్న జి-7 కూటమి

న్యూఢిల్లీ,జూన్ 18: ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరగడంతో జి7 దేశాలు కూడా మనదేశ అభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ కలిసి జి7 కూటమిగా ఉన్నాయి. ఈ దేశాలే ప్రపంచంలోని సంపన్న ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు పొందాయి. వాతావరణ మార్పులు, ఆర్థిక సంక్షోభాలు, భద్రతా సవాళ్లు, సరఫరా వ్యవస్థల వంటి అంశాలపై నిర్ణయాలుతీసుకునే సమయంలో భారత్‌ను కూడా చర్చల్లో భాగస్వామి చేస్తున్నాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థాయిలో ప్రతిబింబించడం లేదనే భావన చాలాకాలంగా ఉంది. ఈ దేశాల తరఫున బలంగా మాట్లాడుతున్న దేశంగా భారత్ ఎదిగింది. 140 కోట్లకుపైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగం, సాంకేతిక రంగాల్లో వేగంగా ఎదుగుతోంది. సరఫరా వ్యవస్థలను విస్తరించాలనుకుంటున్న పలు దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారింది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతుండటం పలు దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తున్నారు. ప్రపంచ వాతావరణ లక్ష్యాలు సాధించాలంటే 140 కోట్ల జనాభా ఉన్న భారత భాగస్వామ్యం తప్పనిసరి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ భారీ పెట్టుబడులు పెడుతోంది. అంతర్జాతీయ సౌర కూటమి వంటి కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి అంశాల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని కొనసాగిస్తోంది. ఏ ఒక్క కూటమికీ పూర్తిగా అనుకూలంగా కాకుండా, చర్చలు, దౌత్య పరిష్కారాలకు ప్రాధాన్యం ఇస్తోంది. జీ7 సమావేశాల్లో భారత్ పాల్గొనడం ఇప్పుడు కేవలం ఆహ్వానిత దేశం హోదాకు మాత్రమే పరిమితం కావడం లేదు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, సాంకేతికత, అభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలు, పరిష్కారాలను ప్రపంచానికి సూచిస్తోంది.

## ఉద్ధవ్‌ఠాకరే కూటమిలో తిరుగుబాటు

ముంబయి,జూన్ 18: ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబిటి)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చినవారే తమ వాళ్లని, రాని వాళ్లు ద్రోహులని మండిపడ్డారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## నేతల పేర్ల ఉచ్ఛారణలో దోషాలు అసెంబ్లీలో క్షమాపణలు కోరిన గవర్నర్

చెన్నై,జూన్ 18: తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఇవాళ ఆ రాష్ట్ర అసెంబ్లీని ఉద్దేశిస్తూ ప్రసంగించారు. ఆ సమయంలో ఆయన అనేక మంది తమిళ నేతల పేర్లను ఉచ్ఛరించారు. అయితే ఆ పేర్లు చదివే క్రమంలో ఆయన ఆ పేర్లను తప్పుగా పలికారు. దీని పట్ల క్షమాపణలు కోరుతున్నట్లు గవర్నర్ అర్లేకర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తమిళ సిద్ధాంతకర్తలు, సామాజిక సంస్కర్తలను ఉద్దేశిస్తూ గవర్నర్ మాట్లాడారు. తన ప్రసంగంలో ఆయన కొందరి పేర్లను ప్రస్తావించారు. పెరియార్ ఈవీ రామస్వామి, కే కామరాజ్, రాణి వేలూ నచియార్, అంజలీ అమ్మాల్ లాంటి ప్రముఖుల పేర్లను ఆయన చదివారు. అయితే ఆ ప్రసంగం చేస్తున్న సమయంలో కొన్ని పేర్లను గవర్నర్ అర్లేకర్ తప్పుగా ఉచ్ఛరించారు. వాస్తవానికి గోవా రాష్ట్రానికి చెందిన ఆయన తమిళ పేర్లను చదవడంలో కొంత ఇబ్బందిపడ్డారు. తన ప్రసంగంలోని ఓ పేరాను చదివిన తర్వాత ఆయన అకస్మాత్తుగా క్షమాపణలు చెప్పారు. నన్ను క్షమించండి, కొన్ని పేర్లను తప్పుగా చదివినట్లు పేర్కొన్నారు.

## ముగ్గురిని సజీవదహనం చేసిన ఇసుకమైనింగ్ మాఫియా

కోరియా, జూన్ 18: చత్తీస్‌ఘడ్‌లో ఇసుక మైనింగ్ వివాదం ముగ్గురి ప్రాణాలను బలి తీసుకుంది. ఫార్చ్యూనర్ వాహనానికి నిప్పుపెట్టడంతో దాంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు సజీవ దహనం అయ్యారు. కోరియా జిల్లాలో జరిగిన ఈ హత్య ప్లాన్ ప్రకారం జరిగినట్లు తెలుస్తోంది. ట్రక్కుల మధ్య ఫార్చ్యూనర్ వాహనాన్ని ట్రాప్ చేసి, దానిపై పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. మృతుల్లో స్థానిక బిజెపి నేత, మాజీ పంచాయతీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ ఉన్నారు. సోనాహట్ పోలీసు స్టేషన్ పరిధిలోని నౌగెయిన్ గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇసుక మైనింగ్ ఆపరేషన్‌కు చెందిన ఓ సమస్య పరిష్కారం కోసం భరత్ సింగ్ చర్చలకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కానీ అతన్ని ట్రాప్ చేసి చంపారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే నలుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. అక్షత్ త్రిపాఠి, విశాల్ త్రిపాఠి, సత్యప్రకాశ్ త్రిపాఠి, మన్ను త్రిపాఠిలను అదుపులోకి తీసుకున్నారు. ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

## పెళ్లయిన నెలరోజులకే వివాహిత ఆత్మహత్య



ముంబయి,జూన్ 18: మహారాష్ట్రలోని ముంబై సమీపంలో ఉన్న అంబర్‌నాథ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహమై 48 రోజులు కూడా గడవకముందే విశాఖ తిల్కర్ అనే 26 ఏళ్ల వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది. వృత్తిరీత్యా వైద్యుడైన ఆమె భర్త, అలాగే అత్తమామలు కలిసి అదనపు కట్నం కోసం ఆమెను మానసికంగా, శారీరకంగా తీవ్రంగా వేధించడమే కాకుండా, ఆమె వ్యక్తిగత స్వేచ్ఛను పూర్తిగా హరిస్తూ ఇల్లంతా నిఘా కెమెరాలు పెట్టి నిరంతరం గమనించేవారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖకు నితిన్‌తిల్కర్ అనే వైద్యుడితో ఏప్రిల్ 30న ఘనంగా వివాహం జరిగింది. పెళ్లయిన తర్వాత కొన్ని రోజులు అంతా బాగున్నట్లు అనిపించినా, ఆ తర్వాత భర్త, అత్తమామలు పెళ్లిలో ఇచ్చిన కానుకలు, మర్యాదలు సరిగ్గాలేవంటూ అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రారంభించారు. పుట్టింటి నుంచి మరికొంత డబ్బు, బంగారు ఆభరణాలు తీసుకురావాలని విశాఖపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఇంతటితో ఆగకుండా ఇంటి లోపల, బయట నిఘా కెమెరాలను అమర్చారు. చివరకు మరణానికి రెండు రోజుల ముందు, పక్కింటి మహిళతో మాట్లాడిందనే నెపంతో భర్త ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఈ వేధింపుల గురించి విశాఖ ఫోన్‌చేసి తనతల్లికి చెప్పుకుని కన్నీరుపెట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు ఆమెను తమ ఇంటికి తీసుకువెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుండగానే, ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందనే వార్త వినాల్సి వచ్చింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శివాజీనగర్ పోలీసులు భర్త నితిన్ తిల్కర్, అత్త, మరిదిపై కేసు నమోదు చేశారు.

## ఒక్కో ఎంపికి 50 కోట్లు ఆఫర్ చేసారు!

### తిరుబాటు ఎంపిలపై సంజయ్‌రౌత్ ఫైర్



న్యూఢిల్లీ,జూన్ 18: మహారాష్ట్రలోని శివసేన ఉద్ధవ్ ఠాకరే వర్గంలో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది. జూన్ 19న పార్టీ 60వ వ్యవస్థాపక దినోత్సవం జరగాల్సి ఉండగా, అంతకంటే ముందే పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేశారు. ఆపరేషన్ టైగర్ పేరుతో సాగుతున్న ఈ రాజకీయ వ్యూహంలో భాగంగా, తమ పార్టీకి చెందిన మొత్తం తొమ్మిది మంది ఎంపీలలో ఆరుగురు విడిపోయి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడటానికి, ఆపై ఏకనాథ్ షిండే వర్గంలో విలీనం కావడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. వీరిలో ఇప్పటికే కనీసం నలుగురు ఎంపీలు తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ సమర్పించడం సంచలనం సృష్టిస్తోంది. మరోవైపు ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఉద్ధవ్ ఠాకరే వర్గం రంగంలోకి దిగింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి చీలిక వర్గాన్ని గుర్తించవద్దని స్పీకర్‌ను కోరుతూ, అత్యవసరంగా గురువారం ఉదయం ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎంపీలపై విప్ జారీ చేసింది. పార్టీ నమ్మకస్థులైన కీలక నేతలు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ తదితరులు స్పీకర్‌ను కలిసి తమ వాదనను బలంగా వినిపించారు. ఈసందర్భంగా సంజయ్ రౌత్ విలేకరులతో మాట్లాడుతూ తమ ఎంపీలను లొంగతీసుకోవడానికి ఒక్కొక్కరికి రూ. 50 కోట్ల వరకు ఆఫర్ చేశారని, తీవ్రమైన బాహ్య ఒత్తిళ్లు తెస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. జూన్ 22న ఉద్ధవ్ ఠాకరే పార్టీ పెద్దలందరితో కలిసి ఒక విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం ఏకనాథ్ షిండే తన సీనియర్ నాయకులతో కలిసి ఢిల్లీలోనే మకాం వేసి, తిరుగుబాటు ఎంపీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఎంపీలు ఇంకా లేఖపై సంతకాలు చేయాల్సి ఉండటంతో చిన్నపాటి సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సమాచారం. ఒకవేళ ఈ తిరుగుబాటు విజయవంతమైతే పార్లమెంట్‌లో షిండే బలం 13కుచేరి కేంద్రంలోని అధికార కూట మిలో ఆయన పట్టు మరింత పెరగనుంది. 2022 నాటి శివసేన చీలికను గుర్తుకు తెస్తున్న ఈ పరిణామాలు మహారాష్ట్ర రాజకీయాలను ఏ మలుపు తిప్పుతాయో అన్నది లోక్‌సభ స్పీకర్ ఇచ్చే తీర్పుపైనే ఆధారపడి ఉంది.

## కేంద్ర మంత్రి అమిత్‌షాతో యుఎస్ రాయబారి భేటీ



న్యూఢిల్లీ,జూన్ 18: కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఆయన నివాసంలోనే భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియా గోర్ కలుసుకుని విస్తృత చర్చలుజరిపారు. ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ, సరిహద్దు భద్రత, నేరస్తులపై సంయుక్త చర్యలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం ఫ్రాన్స్‌లోని జీ 7 సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అయిన మరుసటి రోజే జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.భేటీ అనంతరం సెర్జియో గోర్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ హోంమంత్రి అమిత్ షాతో అద్భుతమైన సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, మాదకద్రవ్యాలు, అక్రమ డ్రగ్స్ నుంచి ప్రజలను రక్షించడం, సరిహద్దుల భద్రతను బలోపేతం చేయడం, రెండు దేశాల్లో నేరస్తులను న్యాయస్థానం ముందుకు తీసుకురావడంలో సహకారాన్ని మరింత పెంచే అంశాలపై ఫలవంతమైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. జీ7 సదస్సు సందర్భంగా ట్రంప్‌తో సమావేశమైన మోడీ.. భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాలపై కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించారు.పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అభినందించినట్లు మోడీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు హోర్ముజ్ జలసంధి తెరిచి ఉండటం అత్యంత కీలకమని, సముద్రయాన సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కిచెప్పారు.

## పాకిస్థాన్‌లో సిక్కు జంట హత్య

కరాచి,జూన్ 18: పాకిస్థాన్‌లో ఒక సిక్కు జంట దారుణ హత్యకు గురైంది. గురుద్వారాను నిర్వహిస్తున్న దంపతుల్ని దుండగులు కాల్చిచంపారు. ఈ ఘటన పాకిస్తాన్‌లోని ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్, మర్దాన్ జిల్లా, బాబూ మొహల్లాలో జరి గింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కడ ఒక గురుద్వారాను జగన్నాథ్, అస్మావాంటి అనే సిక్కు దంపతులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆ గురుద్వారాలోకి దుండగులు ఆయుధాలతో ప్రవేశించారు. సిక్కు దంపతులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన దంపతులు అక్కడికక్కడే మరణించారు. అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దీనిపై మర్దాన్ జిల్లా పోలీస్ అధికారి మసూద్ అహ్మద్ స్పందిస్తూ విచారణ జరుగుతోందని, నిందితుల్ని పట్టుకుంటామని తెలిపారు. అలాగే, ఈ కాల్పులకు గల కారణాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నా మని తెలిపారు. ఈ ఘటనను స్థానిక సిక్కు ప్రజలు, సంఘాలతోపాటు రాజకీయ నేతలు కూడా ఖండించారు. ఖైబర్ పక్తుంఖ్వా స్పీకర్ సురేష్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి సిసిటివిలో రికార్డైన దృశ్యాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

## డార్క్‌వెబ్‌గా మారుతున్న టెలిగ్రామ్

### ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్




న్యూఢిల్లీ,జూన్ 18: టెలిగ్రామ్‌కు ఉచ్చు బిగుస్తోంది. కేంద్ర ప్రభుత్వం మెసేజింగ్ ఫ్లాట్‌ఫారమ్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో పరీక్ష పూర్తయ్యే వరకు టెలిగ్రామ్‌పై కేంద్రం బ్యాన్ విధించింది. ఈ నిర్ణయాన్ని ఛాలెంజ్ చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనికి ప్రతిగా ఈ యాప్ 'డార్క్ వెబ్'గా మారిందంటూ కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇది ప్రభుత్వం నుంచి తప్పించుకోవడానికి సైబర్ మోసగాళ్లు, తీవ్రవాద గ్రూపులు, ఇతర ప్రమాదకారులు దీనిని ఎక్కువగా వాడుతున్నారని ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. నేరపూరిత నెట్వర్క్‌లు, తీవ్రవాద గ్రూపుల ద్వారా టెలిగ్రామ్ దుర్వినియోగం పెరుగుతోందని కేంద్రం వివరించింది. నీట్ వంటి లీకైన పరీక్ష పత్రాల వ్యాప్తి, సైబర్ మోసాలు, ఉగ్రవాద సంబంధిత ప్రచారం, బాలల లైంగికదోపిడీకి సంబంధించిన మెటీరియల్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలతో సహా అనేక రకాల చట్టవిరుద్ధ కార్యకలాపాలకు టెలిగ్రామ్ ఒక కీలక వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్ల ద్వారా ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్, తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. టెలిగ్రామ్‌లో ప్రైవసీ ఫీచర్ల ద్వారా నేరపూరిత నెట్వర్క్‌లను అధికారులు గుర్తించడం కష్టంగా మారిందని కేంద్రం తెలిపింది. టెలిగ్రామ్ ద్వారా నకిలీ అకౌంట్లు సృష్టించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తెలిపింది. ఆధార్ వివరాలు, మొబైల్ నెంబర్లు, వ్యక్తిగత సమాచారం వంటి డేటాను విక్రయించే బాట్లుకూడా టెలిగ్రామ్‌లో పనిచేస్తున్నాయని ఆరోపించింది. సైబర్ నేరాల కోసం మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల కొనుగోలు, అమ్మకాలు కూడా టెలిగ్రామ్ ద్వారా జరుగుతున్నా యని వెల్లడించింది. కొన్ని ఛానెళ్లు మాల్వేర్, హ్యాకింగ్ టూల్స్, భద్రతా వ్యవస్థల్ని తప్పుంచుకునే సాఫ్ట్‌వేర్‌లను వ్యాప్తి చేస్తున్నాయని కేంద్రంపేర్కొంది. కొన్ని ఆండ్రాయిడ్ యాప్‌లు టెలిగ్రామ్ కమాండ్ అండ్ కంట్రోల్ సర్వర్‌గా ఉపయోగించి యూజర్ల డేటాను దొంగిలిస్తున్నాయని తెలిపింది. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర కాపీరైట్ కంటెంట్‌ను అక్రమంగా వ్యాప్తి చేస్తున్నట్లు ఆరోపించిన కేంద్రం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లుకూడా కోర్టుకు వివరించింది.

## రష్యాపై ఉక్రెయిన్ భీకర డ్రోన్ దాడులు



మాస్కో,జూన్ 18: ఉక్రెయిన్ డ్రోన్ దాడులను రోజు రోజుకు విస్తరిస్తోంది. తన సరిహద్దుల నుంచి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న మాస్కోను టార్గెట్‌గా చేసుకొని భీకర దాడులకు పాల్పడుతోంది. గత నెల రోజుల నుంచి ఉక్రెయిన్ రష్యాపై డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ప్రధానంగా చమురు శుద్ధి కర్మాగారాలు , ఇంధన సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుంటోంది. ఇదే క్రమంలో గురువారం రష్యా రాజధాని మాస్కోపై అతి పెద్ద డ్రోన్ దాడికి పాల్పడింది. మాస్కోలోని ఆయిల్ రిఫైనరీకి సమీపంలో దాడికి పాల్పడటం గమనార్హం. దీంతో అప్రమత్తమైన రష్యా అధికారులు మాస్కోలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలలో విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. డ్రోన్ దాడులను తిప్పికొట్టే క్రమంలో మాస్కో లోని అత్యంత రద్దీగా ఉండే షెరెమెటివో విమానాశ్రయం నుండి ప్రయాణికులను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనేక విమానాలను దారి మళ్లించారు. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ మాట్లాడుతూ ఉక్రెయిన్ దాడులు నిజమేనని దాదాపు 180 డ్రోన్లను మాస్కో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూల్చి వేసినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా 500 డ్రోన్లు కూల్చివేసినట్లు వివరాలను వెల్లడించారు.

# సంక్షిప్త వార్తలు

## ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్టసభలు: పాక్ మంత్రి



ఇస్లామాబాద్,జూన్ 18: పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబుపేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు.

## బంగ్లాదేశ్‌లో శ్రీరాముడి విగ్రహనిర్మాణం నిలిపివేత

ఢాకా,జూన్ 18: బంగ్లాదేశ్‌లో మత సామరస్యానికి విఘాతం కలిగించే పరిణామం చోటుచేసుకుంది. దేశంలోనే అత్యంత ఎత్తైనదిగా నిర్మిస్తున్న 81 అడుగుల శ్రీరాముడి విగ్రహ నిర్మాణ పనులను, ఇస్లామిక్ ఛాందసవాద గ్రూపుల నుంచి బెదిరింపులు రావడంతో నిలిపివేశారు. ఈ పరిణామాలపై హిందూ మైనారిటీ వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలకు దిగాయి. ఫలితంగా అక్కడ మైనారిటీల భద్రతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. ఉత్తర బంగ్లాదేశ్‌లోని గైబంధా జిల్లా, పలాశ్‌బరి ఉపజిల్లాలో ఉన్న శ్రీశ్రీ రాధా గోవింద, కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం నిర్మాణం పూర్తయింది. శుక్రవారం ప్రార్థనల అనంతరం కొన్ని రాడికల్ గ్రూపులు శ్రీరాముడి చిత్రపటాలపై బూట్లు విసురుతూ, నిర్మాణాన్ని బుల్డోజర్‌తో కూల్చివేస్తామని బెదిరించినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ బెదిరింపులతో భయాందోళనకు గురయ్యామని, అందుకే పనులు నిలిపివేసినట్లు ఆలయ అధ్యక్షుడు హరిదాస్ చంద్ర దాస్ తెలిపారు.

## బ్రహ్మపుత్రపై చైనా భారీప్రాజెక్టు

న్యూఢిల్లీ,జూన్ 18: భారత్‌కు ఎంతో కీలకమైన బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలోనే మెగా డ్యామ్ నిర్మించడంపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. టిబెన్‌లోని యార్లుంగ్ సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై డ్యామ్ నిర్మాణ పనుల్ని చైనా వేగం చేసింది. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణ, జలవనరుల, వ్యూహాత్మక భద్రతపై ప్రభావం పడొచ్చని భారత్ భయపడుతోంది. యార్లుంగ్ సాంగ్పో టిబెట్‌లో పుట్టి, అరుణాచల్ ప్రదేశ్‌లోకి సియాంగా నదిగా ప్రవేశించి, ఆ తర్వాత అస్సాంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. ఇప్పుడు డ్రాగన్ కంట్రీ చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల భారత ప్రయోజనాలకు భగం కలిగే అవకాశం ఉంది. చైనా నిర్మిస్తున్న భారీ డ్యామ్ వల్ల నది సహజ ప్రవాహంలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. చైనా తనకు కావాల్సిన సమయంలో నది ప్రవాహాన్ని ఒక ఆయుధంగా భారత్‌పై వాడే అవకాశాలు లేకపోలేదు. దిగువ ప్రాంతాల్లో వరదలు లేదా కరువు పరిస్థితుల్ని సృష్టించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నదీ ప్రవాహంపై చైనా పట్టు సాధిస్తే, ఎప్పుడైనా రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు ఏర్పడితే, ఈ నీటి ద్వారా భారత్‌ను నష్టపరిచే అవకాశాలు ఉన్నాయి.

## మమతా బెనర్జీకి కోల్‌కత్తా హైకోర్టు షాక్

కోల్‌కత్తా,జూన్ 18: టిఎంసి అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టిఎంసి రెబల్ నేత రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థిస్తూ ఇప్పటికిప్పుడు ఈ అంశంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణారావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. టిఎంసికి చెందిన ఎమ్మెల్యేలు చాలా మంది మమతకు, పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సంగతి తెలిసిందే. 64 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, తమ పార్టీ తరఫున రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని బెంగాల్ స్పీకర్ రతింద్ర బోస్‌ను కోరారు. 90 మంది ఎమ్మెల్యేల్లో 64 మంది ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో ఆయననే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

## జుట్టుకి ముల్తానీ మాస్క్!



తక్కువ ఖర్చుతో తొందరగా తాజా మెరుపుని పొందాలంటే మనందరి మొదటి ఎంపిక ముల్తానీ మట్టే. దీన్ని ఎక్కువగా ముఖానికి మాస్క వేసుకునేందుకు వాడతారనే తెలుసు. కానీ ఇది జుట్టుకీ బోలెడన్ని ప్రయోజనాలు ఇస్తుందట.

★. ముల్తానీ మట్టి జుట్టకి ఉన్న మురికినీ, చుండ్రునీ వదలిస్తుంది. మాడుపై అదనంగా విడుదలయ్యే నూనెల్ని నియంత్రిస్తుంది. కండిషనర్‌గా పనిచేసి కురులను మృదువుగా, మెరిసేలా చేస్తుంది. ఇందుకు ముల్తానీ మట్టి, బియ్యప్పిండి సమాన భాగాలుగా తీసుకుని కప్పు పెరుగు, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి మెత్తని పేస్టులా చేయాలి. దీన్ని మాడు నుంచి చివర్లకు పట్టించాలి. అరగంటాగి గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి.

★ నాలుగుచెంచాల మల్తానీ మట్టికి రెండుచెంచాల నిమ్మరసం, చెంచా పెరుగు చేర్చి పేస్ట్‌లా చేయాలి. దీనినన కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంటాగి రసాయనాలు లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. కురులు నిగనిగలాడతాయి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు చుండ్రుని తగ్గిస్తాయి. □

## ఒత్తిడి ఎక్కువ అయిందా ?

బరువు పెరిగితే ఎక్కువ తినేస్తున్నామేమో అన్న కంగారు. నిద్ర పట్టక పోతుంటే ముందే మెనోపాజ్ వస్తోందేమో అన్న భయం, గాయాలు మానకపోతే మధు మేహమేమో ఇలా అనుమానించుకుంటూ పోతుంటాం. అయితే ఒత్తిడి కలిగించే హార్మోను పెరిగిందేమో గమనించుకోవాలి.

మెటబాలవజం సరిగా ఉండాలన్నా.. రక్తంలో చక్కెరలు, హార్మోన్ల స్థాయుల్లో సమన్వయం జరగాలన్నా కాస్త ఒత్తిడి మంచిదే. అంటే దానికి కారణమయ్యే కార్టిసాల్ కొద్దిస్థాయుల్లో విడుదలైతే ఆరోగ్యమే. అది హద్దు దాటితేనే అనారోగ్యం పొట్ట పెరిగిపోతోంది. దుస్తుల్లోంచి కనిపిస్తోందంటూ తెగ ఇబ్బంది పడిపోతాం కదా! అది పెరుగుతూ వస్తోన్నా అనుమానించాల్సిందే. ఒత్తిడితో తెలియకుండానే స్వీట్లు, చిరుతిళ్లవైపు ఆకర్షితులం అవుతాం. అదేమో బరువు పెరగడానికి కారణమవుతుంది. ఒత్తిడి పెరిగేకొద్దీ శరీరంలో నిల్వ ఉండే గ్లూకోజు ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అదీ పొట్ట దగ్గర కొవ్వుగా



చేరుతుందట. రాత్రుళ్లు నిద్ర పట్టకపోవడం పట్టినా పదే పదే మెలకువ రావడమూ కార్టిసాల్ పెరిగడానికి సూచనలే. పదే పదే ముఖం వాయడం, నీరు చేరినట్లుగా అనిపించినా తేలిగ్గా తీసుకోవద్దు. అంతెందుకు శరీరంపై ఏవైనా గాయాలైతే కొన్ని రోజుల్లో మానడం మామూలే. గాయం తీవ్రతను బట్టి నయమయ్యే సమయంలో మార్పు ఉంటుంది. చిన్నచిన్నవీ తగ్గడం లేదంటే దానికి కారణమయ్యే సైటోకైన్స్ సరిగా పనిచేయడం లేదని అర్థం పెరిగిన ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తి సైటోకైన్స్ పనితీరుకు అడ్డుపడి, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమవు తాయి. తిండి పడలేదు, జీర్ణవ్యవస్థలో ఏదో ఇబ్బంది.. గ్యాస్ పదే పదే పలకరిస్తోంటే మనం చెప్పుకొనే కారణాలే ఇవి. కొన్నిసార్లు నెలసరి రాబోతోందని సర్దిపుచ్చుకుంటాం కూడా. కానీ అతి ఒత్తిడి కూడా జీర్ణప్రక్రియపై ప్రభావం చూపుతుంది. □

## లాలి పాటలే బుజ్జాయికి తొలి పాఠం



బిడ్డ పుట్టగానే బాధ్యత తీసుకుంటుంది అమ్మ. ఆ బుజ్జాయిని గొప్ప మనిషిగా తీర్చిదిద్ది, ఈ లోకానికి అందించే వరకూ ఆమె విశ్రమించదు. ఆ ప్రయాణం లో ప్రతి అడుగూ ఓ అద్భుతమే! అందుకే తల్లీబిడ్డల మధ్య బంధం పరిశోధకులకి ఓ హాట్ టాపిక్! అలా ఈమధ్య జరిగిన ఓ పరిశోధనలో, తల్లి లాలిపాట కూడా చిన్నారి ఎదుగుదల మీద గొప్ప ప్రభావం చూపుతుందని తేలింది. ప్రాంతానికీ, భాషకీ

అతీతంగా ప్రపంచంలోని ప్రతి తల్లీ తన బిడ్డని పాటతో లాలిస్తుంది. అసలు సంగీతం లాలిపాటతోనే మొదలైందని అంటారు. ప్రపంచంలో బెస్ట్‌సింగర్ తల్లే అని ఒప్పుకొంటారు. అందుకే మియామీ యూనివర్సిటీ పరిశోధకులు చిన్నారుల మీద తల్లి లాలిపాట ప్రభావం గురించి పరిశోధించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం వారు 70 మంది పసిపిల్లలని గమనించారు. తల్లి లాలిపాట పాడుతున్నప్పుడు వారి మానసిక స్థితినీ, వేరే సంగీతం వింటున్నప్పుడు వారి ఉద్వేగాలనీ పరిశీలించారు. లయబద్ధంగా, ప్రేమగా సాగే లాలిపాటని వినగానే పిల్లల్లో అలజడి సద్దుమణిగి పోతున్నట్లు తేలింది. లాలిపాట పాడుతున్నప్పుడు బుజ్జాయి తల్లి వంకే చూస్తుంటుంది. ఆ చిన్నారి స్పందనలకు అనుగుణంగా తల్లి కూడా, పాటలోని లయని మారుస్తూ ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్యా గొప్ప అనుబంధం ఏర్పడుతున్నట్లు గమనించారు. లాలిపాటతో పిల్లలు శబ్దాలను కూడా సులువుగా గ్రహించగలుగుతున్నారట. అలా లాలిపాట పిల్లవాడికి భాషని కూడా పరిచయం చేస్తున్నదన్న మాట. లాలిపాట పాడుతూ చిన్నారితో గడపడం వల్ల తల్లి మనసు కూడా ప్రశాంతత పొందుతున్నట్లు తేలింది. చాలామంది తల్లులు డెలివరీ తర్వాత, శరీరంలోని హార్మోన్ల మార్పులతో డిప్రెషన్‌కు లోనవుతారు. దీన్నే అంటారు తల్లిలో ఏర్పడే ఈ నిరాశ నుంచి దృష్టి మళ్లించేందుకు లాలిపాట మందులా పనిచేస్తుందట. అంటే అమ్మ తనని తాను సంబాళించుకుంటూ, బుజ్జాయికి ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్నమాట. □

## భావోద్వేగాలను పరిశుద్ధ పరచుకున్నవాడే..

మనిషి సకల కార్యకలాపాలూ ఒక్క మనస్సు నుండే జరుగుతాయి. అదొక్కటీ పరిశుద్ధమైతే సకల కర్మలూ 'సత్కర్మల్లు అవుతాయి, లేకపోతే 'దుష్కర్మలు' అవు తాయి. అందుకే యావత్ ధర్మశాస్త్రాలు మనో పరి శుద్ధతకే పెద్దపీట వేస్తున్నాయి. ఆత్మశుద్ధే ధర్మాల అంతిమ లక్ష్యం. మనస్సును జయించినవాడికి అది మిత్రుడు, లేనిచో శత్రువు అని భగవద్గీత (6:6); హృదయశుద్ధి గలవారు దేవుని చూచెదరని పరిశుద్ధ బైబిలు (మత్తయి 5:8); మనస్సును పరిశుద్ధం చేసు కున్న వ్యక్తి నిస్సందేహంగా సాఫల్యం పొందుతాడని ఖురాను (87:14) ప్రకటిస్తున్నాయి. దీనిని బట్టి మనో పరిశుద్ధతకి ధర్మ గ్రంథాల్లో ఎంతటి ప్రాధా న్యత ఉందో అర్థం చేసు కోవచ్చు. మనిషిలో శారీరక దారుఢ్యం, మేధాసంపత్తి, లలితకళలు, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం వంటి ఎన్నో విశేషాలు, శక్తిసామర్థ్యాలు ఉండవచ్చు. కానీ ప్రజల్లో 'హృదయపూర్వకమైన గౌరవ స్థానం ఏర్పడేది మాత్రం అతడు కలిగి ఉండే 'సౌశీల్యత అనే నైతిక, మానవీయ 'కౌసల్యము'ను బట్టే. ఈ సౌశీల్యతకు కేంద్ర స్థానం మనసే. భౌతిక వ్యవసాయం – నైతిక వ్యవసాయం! భౌతిక మనుగడకు వ్యవసాయ క్షేత్రంలో మేలు చేసే పంట మొక్కలను పోషిస్తూ, కీడు చేసే 'కలుపు మొక్కలను' ఎప్పటికప్పుడు తుంచి వేయడం ఎంత ప్రకృతి సహజమో, నైతిక మనుగడకు 'మనో క్షేత్రం'లో నైతిక వ్యవసాయం చేయడం అంత తప్పనిసరి. దీనినే సెక్యులర్ పరిభాషలో 'నైతిక మార్గం అని, ఆధ్యాత్మిక పరి భాషలో 'భక్తి మార్గం' అని అంటారు. ఈ పనులలో ఏ ఒక్కటి విడనాడినా మనిషి నైతిక మనుగడ నాశనం కాక తప్పదు. మన మనో క్షేత్రంలో వినయం, నమ్రత, శాంతి, మైత్రి, క్షమాశీలత వంటి అనుకూల భావోద్వే గాల సాగు చేస్తున్నప్పుడు...అహంకారం, గర్వం, ఈర్ష్యా సూయలు, కోపం, పగ, ప్రతీకారం వంటి ప్రతికూల భావోద్వేగాల కలుపు మొక్కలు ఏపుగా పెరిగి పోతుంటాయి. అది ప్రకృతి సిద్ధం, దానిని అసలే మొలవకుండా నివారించడం అసాధ్యం. కాబట్టి, ఆ కలుపు మొక్కలు బలపడ కుండా మొగ్గలోనే తుంచి పారేస్తూ, మనో క్షేత్రాన్ని ఎప్పటికప్పుడు 'పరిశుద్ధం చేస్తూ సాగడమే మనిషి సాఫల్యానికి ఏకైక మార్గం.

ముహమ్మద్ ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్

## వాడిన పూలతో..



దేవుడికో, జడలోనో అలంకరించేస్తాం. తర్వాత వాటిని వ్యర్థంగా భావించి తీసి బయట పారేస్తాం. కానీ, వీటితో బోలెడు ప్రయోనాలున్నాయి. పండగల్లో అలంకరణలోనూ ఎక్కువగానే వాడతాం. అవి కాస్త ఎండిపోయాక తీసి పారేయకండి. వీటితో ఇంట్లోకి దోమలు, కీటకాలు రాకుండా చేయొచ్చు. ఇందుకోసం మిక్సీ జార్‌లోకి గుప్పెడు బంతి పూల రేకల్ని తీసుకుని, అందులో కాస్త బేకింగ్ సోడా, మూడు వెల్లుల్లి రెబ్బలు, కొన్ని నీళ్ల కూడా చేర్చి మెత్తగా రుబ్బుకోవాలి. దీన్ని వడకట్టి ఓ స్ప్రే సీసాలోకి నింపి ఉదయం, సాయంత్రం కిటికీలూ, మూలల్లో చల్లితే సరి. లోపలకేవీ రావు. అందమైన గులాబీలు వాడి పోయాక పరేయొద్దు. వీటిని రేకలుగా విడదీసి, కాస్త మైనం కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. దీనికి రెండు చుక్కల రోజ్ ఆయిల్‌ని చల్లి ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో పోసి మధ్యలో దారం ఉంచాలి. ఆపై దాన్ని రోజంతా ఫ్రిజ్‌లో ఉంచితే సరి. దీన్ని వెలిగిస్తే ఇల్లంతా వెలుగులు నిండడమే కాదు. సువాసనా వెదజ ల్లుతుంది. అలానే మల్లె, సంపంగి వంటి సువాసన ఇచ్చే పూలలో కొద్దిగా రోజ్ వాటర్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి అందులో కొన్ని చుక్కల లావెండర్ ఆయిల్ వేసి గదిలో స్ప్రే చేసుకుంటే తాజా అనుభూతి కలుగుతుంది. □

## పోషకాల అవిసెలు..



చాక్లెట్లు నుంచి ఓట్‌మీల్ వరకు అన్ని రకాల ఆహారపదార్థాల్లో అవిసెలు కనిపిస్తున్నాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లూ, లిగ్నన్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే వీటిని, మహిళలు రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల, హృదయ సంబంధిత, రుతుక్రమ, క్యాన్సర్‌లకు సంబంధించిన వ్యాధులన తగ్గిస్తాయని టొరంటో విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది.

అవిసెలు మహిళల్లో వచ్చే రొమ్ముక్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్లు రాకుండా నివారిస్తాయని కెనడా న్యూట్రిషన్ కౌన్సిల్ పేర్కొంది. వీటిల్లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు క్యాన్సర్ కణతుల్ని పెరగకుండా నియంత్రి స్తాయి. యుక్తవయసు వారిలో క్యాన్సర్ వచ్చిన వారుంటే రోజూ ఆహారంలో అవిసెలను తీసు కోవడంవల్ల వీటిలో ఉండే లిగ్నన్లు క్యాన్సర్ కణాలతో పోరాడి, వృద్ధి చెందకుండా కాపాడతాయి. రుతు క్రమం ఆగిన మహిళల్లోనే హృద్రోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువున్నాయని తెలిసింది. ఇందుకోసం కొంతమంది మహిళలకు సంవత్సర కాలంపాటు రోజూ నాలుగు చెంచాల అవిసెగింజలు ఇచ్చారు. వీటిలో ఉండే లిగ్నన్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడమే కాకుండి, రక్తనాళాల్లో కొవ్వు పేరుకోకుండా కాపాడాయి. అంతేకాదు రక్తపోటును నియంత్రణలో ఉంచుతాయని తేలింది. టైప్-2 డయాబెటిస్ మెరుగుపడింది. ప్రసవానంతరం లేదా నెలసరి ఆగిన మహిళల్లో అరికాళ్లు, చేతులూ మంట పెడుతుంటాయి. పరిశోధనలో భాగంగా కొంతమంది మహిళలకు రోజూ రెండు చెంచాల అవిసెలు, తృణధాన్యాలను పెరుగు, సలాడ్లు, జ్యూస్‌ల్లో కలిపి ఇచ్చారట. వారం రోజుల్లోనే 57 శాతానికి అరికాళ్ల మంటలు తగ్గినట్లు వారు గమనించారు. □

## తెర

## 'వెంకట్రామయ్య గారి తాలూకా' జులై లో విడుదల



దినేష్ కుమార్ హీరోగా, దివిజ ప్రభాకర్ (ప్రభాకర్ కుమార్తె) హీరోయిన్‌గా మురళీధర్ గౌడ్, సుధ టైటిల్ పాత్రలలో సతీష్ ఆవాల దర్శకత్వం లో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్ర నిర్మాత కోమలి మాట్లాడుతూ... నేను కోమలి ఫోక్ సింగర్‌గా నా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టంతో నేను సినిమా తీయాలి అని ఒక ధ్యేయంతో చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రాన్ని పూర్తి చేసాము. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ..మా 'వెంకట్రామయ్య గారి తాలూకా'చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేసి ఆఫిషియల్ ప్రెస్ మీట్ పెట్టి అనౌన్స్ చేస్తాము. మా కథ విషయానికోస్తే అందమైన ఒక పల్లెటూరులో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బుతో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా. 'వెంకట్రామయ్య గారి తాలూకా' మంచి ఫ్యామిలీ డ్రామాని కుటుంబం తో కలిసి థియేటర్ కి వెళ్లి హాయిగా ఎంజాయ్ చేసేలా చిత్రాన్ని తెరకేకించాం అని దర్శకుడు సతీష్ ఆవాల తెలిపారు.

## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' క్లైమాక్స్ అద్భుతం: రాశీ సింగ్



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తుల్లు. ఈ మూవీతో కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్‌కి జోడిగా రాశీ సింగ్ నటించారు. చిత్రం జూన్ 19న రిలీజ్ కాబోతోంది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?..**

పక్కింటి అమ్మాయిలా నా పాత్ర ఉంటుంది. ఎంతో సహజంగా అనిపిస్తుంది. విత్ అవుట్ మేకప్ నటించాను.

**వడ్డే నవీన్ నుంచి ఏమైనా తెలుసుకున్నారా?..**

వడ్డే నవీన్ గారితో సినిమా అని తెలిశాక చాలా వరకు ఆయన గురించి రీసెర్చ్ చేశాను. ఆయన నటించిన ఎన్నో చిత్రాల గురించి తెలుసుకున్నాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'చిత్రంలో మీ పాత్ర ఎలాంటి టర్నింగ్ పాయింట్‌లా ఉంటుంది?..**

భర్తకు ప్రతీ విషయంలో సపోర్ట్‌గా ఉండే ఓ చక్కటి గృహిణిగా లక్ష్మీ పాత్ర ఉంటుంది. నేను రియల్ లైఫ్‌లో కంప్లీట్ డిఫరెంట్‌గా ఉంటాను. లక్ష్మీ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది.

**దర్శకుడితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చెప్పండి?..**

కమల్ గారికి ఫుల్ క్లారిటీ ఉంటుంది. ఆయనకు ఏం కావాలో అది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉంటారు. లక్ష్మీ ఎలా ఉండాలో.. అలానే ఉండాలని ఆయన చెబుతుంటారు. కొంచెం అటూ ఇటూ కూడా కావొద్దు అని ఆయన అంటుంటారు.

**రెస్టారెంట్ బిజినెస్ ఎలా నడుస్తోంది?..**

రెస్టారెంట్ బిజినెస్ అద్భుతంగా నడుస్తోంది. వడ్డే నవీన్ గారు కూడా నా వ్యాపకాల గురించి అడిగేవారు. నాకున్న రెస్టారెంట్, కెఫె వ్యాపారాల గురించి చెప్తే ఆశ్చర్యపోయారు.

**మీకు ఏ రంగంలో కంఫర్ట్‌గా అనిపిస్తుంది?..**

నాకు సినిమాలు, వ్యాపారాలు రెండూ ఇష్టం. నేను ఇంకా ఇంకా చాలా చేయాల్సి ఉంది. ఇదంతా కూడా నథింగ్. 14 ఏళ్లకే మోడలింగ్ స్టార్ట్ చేశా. ఛత్తీస్ ఘడ్‌లోని భిలాయ్ నుంచి వచ్చాను. మిస్ చత్తీస్ ఘడ్ పోటీలో రెండో స్థానంలో వచ్చాను.

## #VenkyAnil5 & # NkrAR2 ఘనంగా ప్రారంభం



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, 'హిట్ మెషీన్' అనిల్ రావిపూడి కలిసి ఒక పూర్తి స్థాయి పండుగ వినోదాత్మక చిత్రం (#VenkyAnil5 & # NkrAR2) అందించడానికి సిద్ధమవుతు న్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం, పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం, పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ఓపెనింగ్ షాట్‌కు దర్శకత్వం వహించారు. #VenkyAnil5 & # NkrAR2 చిత్రం అనిల్ రావిపూడి స్టయిల్ లో సాగే వినోదం, నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబో ఈ ప్రాజెక్ట్‌కు మరింత ఎట్రాక్షన్ జోడించడంతో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగ చిత్రాలలో ఒకటిగా ఇది నిలుస్తోంది. అనిల్ రావిపూడికి ఉన్న అద్భుతమైన బ్లాక్‌బస్టర్ ట్రాక్ రికార్డ్, స్టార్స్ కలయిక, పరిశ్రమలోని ప్రముఖ నిర్మాణ సంస్థల మద్దతు కారణంగా ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక బృందం పనిచేస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## 27న 'కన్నప్ప' రీ రిలీజ్




డైనమిక్ హీరో విష్ణు మంచు గత ఏడాది 'కన్నప్ప అంటూ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద 'కన్నప్ప మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది గొప్ప నటీ నటులు కీలక పాత్రలను పోషించడంతో ప్యాన్ ఇండియా వైడ్‌గా క్రేజ్‌ను దక్కించుకుంది. 'కన్నప్ప' సినిమాకి తెలుగులో వచ్చిన ఆదరణ, క్లైమాక్స్‌లో విష్ణు నటనకు వచ్చిన ప్రశంసల గురించి అందరికీ తెలిసిందే. మరోసారి ఈ విజువల్ వండర్‌ను ఆడియెన్స్‌కి అందించేందుకు విష్ణు మంచు రెడీ అయ్యారు. సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న 'కన్నప్పని లిమిటెడ్ స్క్రీన్‌లలో రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు విడుదల చేసిన రీ రిలీజ్ డేట్ పోస్టర్ వైరల్ అవుతోంది.

## 'కళాంకి భైరవుడు' టీజర్ లాంచ్



కళాంకి భైరవుడు ఓ విభిన్నమైన గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన మిస్టికల్ థ్రిల్లర్. చేత బడులు, క్షుద్ర పూజలు, నిజ జీవితంలో జరిగిన కొన్ని ఆశ్చర్యకర సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. దర్శకుడు హరి హారన్.వి తన ప్రత్యేక కథన శైలితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గాయత్రీ ప్రొడక్షన్స్, రచ్చమల్ల బ్రదర్స్ బ్యానర్లపై కె.ఎన్. రావు, డా. రచ్చమల్ల శ్రీనివాస రావు నిర్మించిన ఈ చిత్రానికి పి.ఆర్. సంగీతం అందించారు. ఈ చిత్రంలో రాజశేఖర్ వర్మ ప్రధాన పాత్రలో నటించగా, రితిక, పూజ కిరణ్, భవ్యశ్రీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. టీజర్ లాంచ్‌కు ముఖ్య అతిథిగా దర్శకుడు సాయి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ..సాయి రాజేష్ మాట్లాడుతూ,..ప్రతి శుక్రవారం బాక్సాఫీస్ వద్ద పోటీ, సవాళ్లు ఉంటాయి. నా తొలి చిత్రం హృదయ కాలేయం రోజులలో గెస్ట్ కోసం వెతికిన సందర్భాలు గుర్తొస్తున్నాయి. ఇదే వేదికపై బేబీ టీజర్, చెన్నై లవ్ స్టోరీ టీజర్‌లను కూడా విడుదల చేశాం. ..హీరోయిన్ రితిక మాట్లాడుతూ,.. ముందుగా మా టీజర్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసి మాకు అండగా నిలిచిన సాయి రాజేష్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. హీరో రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ,.. మా చిన్న సినిమాకు మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన దర్శకుడు సాయిరాజేష్‌కి, అలాగే మీడియా మిత్రులందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. హీరోయిన్ భవ్యశ్రీ మాట్లాడుతూ,.. ముందుగా మీడియా మిత్రులకు, ప్రేక్షకులకు, అలాగే మా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి రాజేష్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. మా టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. ..నిర్మాత రీ.వి రావు మాట్లాడుతూ,.. మా చిత్రానికి మద్దతుగా ఇక్కడికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, మీడియా మిత్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. దర్శకుడు హరిహారన్ లేకపోతే ఈ సినిమా రూపుదిద్దుకునేది కాదు. ఆయన విజన్, కృషి వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైంది. కళాంకి భైరవుడు చిత్రం చేతబడులు,

## 'కామ్రేడ్ కళ్యాణ్' ఫస్ట్ సింగిల్ 20న రిలీజ్



కింగ్ ఆఫ్ ఎంటర్టైన్‌మెంట్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తున్నారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే శ్రీవిష్ణు తన లేటెస్ట్ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'కామ్రేడ్ కళ్యాణ్'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.




## హ్యాట్రిక్ కొట్టిన హాకీ అమ్మాయిలు

**అక్లాండ్, జూన్ 18:** న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. టోర్నీలో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన తమ చివరి గ్రూపు మ్యాచ్‌లో ఉరుగ్వేపై 3-2 తేడాతో భారత్ విమెన్ టీమ్ గెలుపొందింది.ఇరు జట్ల మధ్య ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్ ఆరంభంలో ఉరుగ్వే ఆధిక్యం కనబరిచింది. 13వ నిమిషంలో కియారా అపెన్నినో గోల్‌తో ఉరుగ్వే 1-0 ఆధిక్యం చాటింది. ఆ తర్వాతి నుంచి భారత్ అటాక్ పెరిగింది. 24వ నిమిషంలో దీపిక సెహ్రావత్ గోల్ చేసి 1-1తో సమం చేసింది. అనంతరం 43వ నిమిషంలో దీపిక సోరెంగ్ చేసిన గోల్‌తో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక 55వ నిమిషంలో ఉరుగ్వే గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేయడంతో ఉత్కంఠ నెలకొంది. ఆతర్వాతి నిమిషంలోనే దీపిక సెహ్రావత్ అద్భుతమైన గోల్ తో భారత్‌ను 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లింది. సెహ్రావత్‌కు ఇది రెండో గోల్. అదే ఆధిక్యాన్ని చివరి నిమిషం వరకు కాపాడుకుని భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌కు ముందు భారత విమెన్ టీమ్... అమెరికా, జపాన్‌లను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఈ గెలుపుతో గ్రూపు దశను అజేయంగా ముగించిన భారత్... శనివారం చిలీతో సెమీస్‌లో తలపడనుంది.

## మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు

**రోటర్‌డామ్(నెదర్లాండ్స్), జూన్ 18:** భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్



మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. మన్‌ప్రీత్‌కు భారత హాకీ జట్టు కూడా గుర్తిండిపోయే కానుక ఇచ్చింది. ప్రో లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ ఛాంపియన్ జర్మనీపై 3-1 గోల్స్‌తో నెగ్గింది.

అరుదైన మైలురాయి అందుకున్న మన్‌ప్రీత్ సింగ్‌ను హాకీ ఇండియా అభినందించి, 10 లక్షల నజరానా ప్రకటించింది. 15యేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్ సింగ్... టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టు సభ్యుడు.ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ సింగ్ ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ మైలురాయిని తన సహచరులు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నట్లు మన్‌ప్రీత్ సింగ్ చెప్పాడు. జాతీయ జట్టుకు అత్యధిక మ్యాచ్‌ల్లో ఆడడం గర్వంగా ఉందని... ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని స్పష్టంచేశాడు.



## ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి

**గ్వియాంగ్(చైనా), జూన్ 18:** చైనాలోని గ్వియాంగ్‌లో జరుగుతున్న పప్రంచ కప్ బాక్సింగ్‌లో భారత బాక్సర్ మీనాక్షి హుడా సత్తా చాటుతోంది. ప్రస్తుతం మహిళల 48 కిలోల విభాగంలో వరల్డ్ నెంబర్ వన్ అయిన మీనాక్షి... 51 కిలోల విభాగంలోకి మారి పోటీపడుతోంది. గురువారం మహిళల 51 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో పోలాండ్ బాక్సర్ నటాలియా కుచ్వెస్కాపై పడిగుద్దులతో విరుచుకుపడింది. 5-0తో ఏకపక్ష విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాతో మీనాక్షి హుడా తలపడనుంది. కాగా మరో భారత భాక్సర్ అభినాష్ జమ్వాల్ పరుషుల 65 కిలోల విభాగంలో ఇంటిదారి పట్టాడు. అతను కిర్గిజిస్థాన్ బాక్సర్ మిర్జోఖిద్ చేతిలో 0-5తేడాతో ఓటమి పొందాడు.

భారత బాక్సర్లు రెండు విభాగాల్లో పతకాలు పక్కా చేశారు. మహిళల 48 కిలోల విభాగంలో జ్యోతి, 85 కిలోల విభాగంలో జుగ్నూ సెమీఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా భారత్‌కు పతకాలను ఖాయం చేసుకున్నారు.కాగా ఈ బాక్సింగ్ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఐదుగురు భారత బాక్సర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 55 కిలోల విభాగంలో నిఖిల్, 70 కేజీల విభాగంలో దీపక్, 57 కిలోల విభాగంలో ప్రాచి, 65 కిలోల విభాగంలో సనేహా క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు.



గోల్ కొట్టి సంబరాలు జరుపుకున్న లూయిస్ డియాజ్

### పనామా ఆశలకు ఘనా చెక్ * మెక్సికోతో తలపడనున్న దక్షిణ కొరియా * కెనడాతో ఖతర్ ఢీ

## సాకర్ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్, కొలంబియా అదుర్స్

**లాస్‌ఏంజిల్స్, జూన్ 18**

ఇంగ్లాండ్ ఘనవిజయంతో ఫీఫా ప్రపంచకప్ జైత్రయాత్రను ప్రారంభించింది. క్రొయేషియాను 4-2తో చిత్తు చేసింది. హ్యారీ కేన్ రెండు గోల్స్‌తో జట్టు విజయంలో కీరోల్ పోషించాడు. మరోవైపు 8 ఏళ్ల తర్వాత ఫిఫా బరిలోకి దిగిన కొలంబియా రీ ఎంట్రీ అదిరింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్‌తో నెగ్గింది.ఇక అదనపు సమయం గోల్‌తో పనామాపై ఘనా విజయం సాధించింది. ఇక గ్రూప్-బిలో స్విట్జర్లాండ్‌తో బోస్నియా- హెర్జెగోవినా, అతిథ్య కెనడాతో ఖతార్, గ్రూప్-ఎలో మెక్సికోతో దక్షిణ కొరియా తలపడనుంది.

### అదరగొట్టిన ఇంగ్లాండ్

హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్... తొలి మ్యాచ్‌లో క్రొయేషియాను చిత్తు చేసింది. స్టార్ ఆటగాడు హ్యారీ కేన్ 12వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌తో గోల్‌కొట్టి ఇంగ్లాండ్‌కు ఆధిక్యం అందించాడు. అయితే, క్రొయేషియా ప్లేయర్ మార్టిన్ బతురినా 36వనిమిషంలో చేసిన గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. మళ్లీ 42వ నిమిషంలో హ్యారీ కేన్ చేసిన రెండో గోల్‌తో ఇంగ్లాండ్ ఆధిక్యం 2-1కు పెరిగింది. తొలి అర్ధభాగం అదనపు సమయంలో (45+5వ నిమిషం) పీటర్ ముసా అద్భుతమైన గోల్‌తో క్రొయేషియాను 2-2తో సమంగా నిలిపాడు. రెండో అర్ధభాగంలో ఇంగ్లాండ్ అటాకింగ్ గేమ్‌తో అదరగొట్టింది. జుడె బెల్లిగ్‌హామ్ (47వ నిమిషం), మార్కస్ రాష్‌ఫోర్డ్ (85వ నిమిషం) గోల్స్‌తో ఇంగ్లాండ్ 4-2 తేడాతో క్రొయేషి యాపై విజయం సాధించింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ కేన్... ఫుట్‌బాల్ దిగ్గజం డేవిడ్ బెక్‌హామ్‌ను సమం చేశాడు. మూడు వేర్వేరు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా హ్యారీ కేన్ (2018, 2022, 2026) నిలిచాడు.అతడి కంటే ముందు బెక్‌హామ్ (1998, 2002, 2006) పేరిట ఈ రికార్డు ఉండేది.

### కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ

గ్రూప్-కేలో జరిగిన మ్యాచ్‌తో కొలంబియా గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చింది. ఉజ్బెకిస్థాన్‌పై 3-1 గోల్స్ తేడాతో నెగ్గింది. 8ఏళ్ల తర్వాత ఫిఫా కప్ ఆడుతున్న కొలంబియా గ్రాండ్ విక్టరీ కొట్టింది. మొదటి అర్ధభాగంలో డేనియల్ మునోజ్ చేసిన గోల్‌తో కొలంబియా ఖాతా తెరిచింది. తొలి అర్ధ భాగం ముగిసేవరకు 1-0ఆధిక్యం నిలుపుకుంది. రెండో అర్ధభాగం 60వ నిమిషంలో ఉగ్లీ ఫైజుల్లావ్ అద్భుత గోల్‌తో ఉజ్బెకిస్థాన్ సమవుజ్జీగా నిలిచింది. ఇది ఉజ్బెకిస్థాన్ జట్టుకు ఫిఫాలో తొలి గోల్. దీంతో ఆ జట్టు అభిమానులకు సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాతి ఐదు నిమిషాల్లోనే డియాజ్ గోల్ సాధించడంతో మళ్లీ కొలంబియా అధిక్యంలోకి వెళ్లింది. ఇక ఇంజ్యూరీ టైమ్ చివరి నిమిషాల్లో కుచో హెర్నాండెజ్ కుడి వింగ్‌లో బంతిని సబ్స్ట్యూట్ కాంపాజ్‌కు క్రాస్ చేయగా అతను హెడర్‌తో గోల్‌లోకి పంపించాడు. ఈ విజయంతో కొలంబియా ఖాతాలో మూడు పాయింట్లు చేరాయి. డానియల్ మునోజ్ (40వ నిమిషం), లూయిస్ డియాజ్ (65వ నిమిషం), జామిన్‌టన్ క్యాపాజ్ (90+9వ నిమిషం) కొలంబియా తరఫున గోల్స్ కొట్టారు.

### ఘనామైన విజయం

సాకర్ ప్రపంచకప్‌ను ఘనామైన విజయంతో ప్రారంభించింది. పనామాపై ఏకైక గోల్‌తో విజయం సాధించింది. స్టార్ ఆటగాడు థామస్ పార్టీ లేకున్నా ఘనా చక్కగా పోరాడింది. పనామాను



నిలువరించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఆట అదనపు సమయంలో ఘనా ప్లేయర్ కలేబ్ (90+5 వ నిమిషం) గోల్ సాధించాడు. దీంతో డ్రా చేద్దామనుకున్న పనామా ఆశలకు తెర పడింది.



బెక్‌హామ్‌ను సమం చేసిన హ్యారీ కేన్

## ఐదో రోజూ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి,జూన్ 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్లోనూ లాభాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సడలడం మార్కెట్ సెంటిమెంట్కు బలాన్నిచ్చాయి. హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల షేర్లు కొనుగోళ్లతో పెరిగితే, ఐటీ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గడం, అమెరికాఇరాన్ శాంతి చర్చలపై సానుకూల సంకేతాలు, ఎఫ్‌పిఐల కొనుగోళ్లు పునరుద్ధరించటం, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు పెరిగి 77,409.98వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 82.30 పాయింట్లు 24,168 వద్ద స్థిరపడింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4.85 పెరగగా,నిఫ్టీ 4.35 ఎగబాకింది. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ 6.46లాభం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ 1.74శాతం




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.56 చొప్పున పెరిగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బీఎస్ఈ 150మిడ్‌క్యాప్ సూచీ 0.41 పెరిగితే బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.67 లాభపడింది.

## పసిడి వెండి ధరలపై ఫెడ్‌రిజర్వు ఎఫెక్ట్



**న్యూఢిల్లీ, జూన్ 18:**అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ బంగారం ధరలు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడంలేదు.అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధాన సంకేతాలు ఇవ్వడంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.గురువారం స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 4,270 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, రోజులో గరిష్ఠంగా 4,330 డాలర్లను తాకింది. మరోవైపు స్పాట్ సిల్వర్ 68.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, సెషన్‌లో 69.85 డాలర్ల వరకు పెరిగింది. అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం,హార్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణ ఆందోళనలు కొంత తగ్గి బంగారం, వెండి కొనుగోళ్లకు మద్దతు లభించిందని కోటక్ సెక్యూరిటీస్ విశ్లేషించింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ, ఈ ఏడాది చివర్లో మరోసారి రేట్ల పెంపు అవకాశం ఉందని సంకేతాలు ఇవ్వడంతో బులియన్ మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగుతోంది.




## ధరలు పెంచుతున్న టాటా మోటార్స్

**ముంబయి,జూన్ 18:**దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటామోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నటువెల్లడించింది. ట్రక్కులు, బస్సులు సహా కమర్షియల్ వాహనాల శ్రేణిలో గరిష్ఠంగా 2.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ధరలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని కొంత మేర భర్తీ చేసేందుకు ధరల సవరణ చేపడుతున్నట్లు కంపెనీ వివరించింది.ధరల పెంపు అన్ని వాహనాలపై ఒకేలా ఉండదని తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెరుగుదల మారుతుందని పేర్కొంది. ఇదే నెల ప్రారంభంలో టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహనాల ధరలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై 1.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు స్పష్టంచేసింది. ఆ పెంపు కూడా వచ్చే నెల నుంచే అమల్లోకి రానుంది. ఇటీవల ముడి పదార్థాల ధరల పెరుగుదల, నిర్వహణ వ్యయాల భారం కారణంగా పలు ఆటో కంపెనీలు ధరలను సవరించాయి. గత నెలలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచగా, మారుతి సుజుకి కూడా ఈ ఏడాది ప్రారంభంలో పలు మోడళ్ల ధరలను పెంచింది.

## ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ,జూన్ 18:**ఉద్యోగుల భవిష్య నిది సంస్థ డిజిటల్ సేవలను మరింత విస్తరిస్తోంది.ఈపీఎఫ్‌వో 3.0 కింద పీఎఫ్ ఖాతాదారులు యూపీఐ యాప్‌లు, పీఎఫ్‌కు అనుసంధానమైన ఏటీఎంల ద్వారా నేరుగా తమ నిధులను ఉపసంహరించుకునే సౌకర్యాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకువస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ఆఫ్ఇండియా(ఎన్‌పీసీఐ) సహకారంతో రూపొందించిన ఈ వ్యవస్థకు సంబంధించిన టెస్టింగ్ ఇప్పటికే పూర్తయ్యాయి. కొత్త విధానంలో పీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తంలో 75 శాతం వరకు నిధులను వెంటనే బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పీఎఫ్ డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ దాఖలు చేసి, ఆమోదం కోసం కొంత కాలం వేచి చూడాల్సి వస్తోంది.కొత్తవ్యవస్థ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ మరింత సులభం, వేగవంతం కానుంది.ఈమార్పుతో ఉద్యోగులకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక సహాయం అందుబాటులోకి వస్తుంది. అదే సమయంలో పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. అయితే పదవీ విరమణ నిధుల భద్రత దృష్ట్యా పటిష్ఠమైన ధ్రువీకరణ, మోసాల నివారణ వ్యవస్థలు అవసరమని వారు సూచిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ సాధించిన పురోగతిని సామాజిక భద్రతా వ్యవస్థలకూ విస్తరించే ప్రయత్నంగా ఈపీఎఫ్‌వో 3.0ను భావిస్తున్నారు.

## బ్రిటిష్ కార్ల దిగుమతులకు రాయితీ సుంకం

**న్యూఢిల్లీ, జూన్ 18:** భారత్‌యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమలులో భాగంగా, వచ్చే 15 ఏళ్లలో బ్రిటన్ నుంచి 3.78 లక్షల సంప్రదాయ ఇంధన (పెట్రోల్, డీజిల్) కార్ల దిగుమతులకు భారత్ కస్టమ్స్ రాయితీ సుంకాలను అనుమతించింది. ఈ ఒప్పందం జూలై 15 నుంచి అమల్లోకి రానుంది. ఆటోమొబైల్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న సుమారు 110 శాతం దిగుమతి సుంకం దశలవారీగా 10 శాతానికి తగ్గనుంది. ఇరు దేశాలు కోటా విధానాన్ని అనుసరించనున్నాయి.

సీఈటీఏ పత్రాల ప్రకారం, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే సంప్రదాయ ఇంధన కార్ల కోటా ఐదో ఏడాదికి గరిష్టంగా 37వేల యూనిట్లకు చేరుతుంది. అనంతరం కస్టమ్స్ సుంకం 10 శాతం వద్ద స్థిరపడుతుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.